# జ్ఞానశేఖరన్ సెల్‌ఫోన్‌లో అశ్లీల చిత్రాలు!

- నిందితుడిపై 8 సెక్షన్ల కింద కేసు నమోదు
- సుమోటోగా కేసు స్వీకరించిన హైకోర్టు


నిందితుడు జ్ఞానశేఖరన్

చెన్నై, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని అన్నా యూనివర్సిటీ విద్యార్థినిపై అత్యాచారం కేసులో అరెస్టయిన 'సెక్సువల్ సైకో' జ్ఞానశేఖరన్ సెల్‌ఫోన్‌లో 50కి పైగా అశ్లీల చిత్రాలున్నట్లు సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. ఈ చిత్రాల్లో అతడి ముగ్గురు భార్యలతో లైంగిక దృశ్యాలు కూడా ఉండడంతో పోలీసులు దిగ్భ్రాంతి చెందారు. అన్నా వర్సిటీలో చదువుతున్న ఓ విద్యార్థిని తన సీనియర్‌తో ఈ నెల 24వ తేది రాత్రి వర్సిటీ ప్రాంగణంలో మాట్లాడుకుంటుండగా, ఓ వ్యక్తి వీడియో తీసి బెదిరించడంతో పాటు, తన స్నేహితుడిపై దాడి చేసి, తనపై అత్యాచారం చేసినట్లు బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో జ్ఞానశేఖరన్ (37)ను పోలీసులు అరెస్ట్ చేసి నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. అనంతరం అతడిపై పలు కేసుల తీవ్రత దృష్ట్యా 8 సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. ఈ క్రమంలో, జ్ఞానశేఖరన్ సెల్‌ఫోన్‌ను పోలీసులు సైబర్ క్రైంకు అప్పగించారు. సైబర్ క్రైం నిపుణుల పరిశోధనల్లో, అతడి సెల్‌ఫోన్‌లోని ప్రత్యేక ఫోల్డర్‌లో అశ్లీల చిత్రాలు బయల్పడ్డాయి. ఈ ఫోల్డర్‌ను తను మాత్రమే చూసేలా ప్రత్యేక పాస్‌వర్డ్ పెట్టుకున్నాడు. అలాగే బాధితురాలి చిత్రాలు కూడా అందులో ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయమై నిందితుడిని ఐదు రోజులు తమ కస్టడీకి అనుమతించాలని పోలీసులు కోర్టును ఆశ్రయించనున్నారు.

### సుమోటోగా స్వీకరించిన హైకోర్టు...

వర్సిటీ విద్యార్థినిపై అత్యాచారం కేసును మద్రాసు హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. అన్నాడీఎంకే మహిళా న్యాయవాది వరలక్ష్మి హైకోర్టుకు ఓ లేఖ రాశారు. అన్నావర్సిటీ విద్యార్థిపై జరిగిన అత్యాచారం కేసులో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ బయటకు రావడం దిగ్భ్రాంతి కలిగించిందని, అందువల్ల ఈ కేసు విచారణ సీబీఐకి అప్పగించాలని అభ్యర్థించారు. ఈ లేఖను అందుకున్న మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణ్యం, వి.లక్ష్మీనారాయణన్‌లతో కూడిన ధర్మాసనం కేసును సుమోటోగా స్వీకరిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అత్యాచారానికి గురైన యువతి రాత్రిపూట తన స్నేహితుడితో కలిసి వుండడాన్ని కొంతమంది తప్పుబడుతున్నారని, ఆ యువతి ఎప్పుడు ఎక్కడైనా ఉండే హక్కు లేదా అని ప్రశ్నించింది. 'నిర్భయ' కోసం కేటాయించిన నిధులేమయ్యాయని, ఆ నిధుల్ని యూనివర్సిటీ ఏ మేరకు ఖర్చు చేసిందని ప్రశ్నించింది. అసలు విద్యార్థినుల భద్రతకు యూనివర్సిటీ తీసుకున్న చర్యలేంటో చెప్పాలని ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలు సమర్పించాలని హోంశాఖ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్, అన్నా వర్సిటీ వైస్ చాన్సలర్, కోట్టూరుపురం మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించింది.

### నేడు అన్నావర్సిటీకి గవర్నర్

రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి శనివారం అన్నాయూనివర్సిటీని పరిశీలించనున్నారు. అత్యాచారం జరిగిన ప్రాంతాన్ని, హాస్టల్ గదులను పరిశీలించడంతో పాటు వర్సిటీ అధికారులతో సమావేశం కానున్నారు.




మన్మోహన్‌సింగ్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ - ఢిల్లీలో పార్టీ ఎంపీలతోపాటు దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సతీమణి గురుచరణ్ కౌర్‌ను పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

# మన్మోహన్ సేవలు మరువలేం

- తమిళానికి ప్రాచీన భాష హోదా ఆయన ఘనతే
- రాష్ట్రానికి ఎన్నో ప్రాజెక్టులు.. మౌలిక సదుపాయాలు
- మెట్రోరైల్, నిర్లవణీకరణ ప్లాంట్ ఆయన చలువే
- సీఎం స్టాలిన్ ఘననివాళి
- ఢిల్లీ వెళ్లి మాజీ ప్రధాని పార్థివ దేహానికి అంజలి

చెన్నై, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మార్గదర్శి, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతితో భారతమాత దేశం గర్వించదగిన తన ముద్దుబిడ్డను కోల్పోయిందని, ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకే కాకుండా దేశానికే తీరని లోటని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శ్లాఘించారు. శుక్రవారం ఉదయం ఢిల్లీలో పార్టీ ఎంపీలతో కలిసి మన్మోహన్ సింగ్ భౌతిక కాయం వద్ద ఆయన నివాళుర్పించారు. ఆ తర్వాత మన్మోహన్ సింగ్ కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో సీఎం మాట్లాడుతూ.. పదేళ్లపాటు ప్రధానిగా ఉంటూ రాష్ట్రాభివృద్ధికి ఎన్నో పథకాలను ప్రకటించిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన, వివిధ ప్రాజెక్టుల అమలు, ముఖ్యంగా చెన్నై నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు మధురవాయల్ - హార్బర్ ఫ్లైఓవర్ల రహదారి ప్రాజెక్టు ప్రకటించారని, వందరోజుల ఉపాధి పథకం, దశబ్దాలుగా తమిళుల కలగా ఉన్న తమిళ భాషకు ప్రాచీన హోదా కల్పించిన ఘనత కూడా మన్మోహన్‌సింగ్‌కే దక్కుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధితో ఆయనకు సన్నిహిత సంబంధాలుండేవని తెలిపారు. మన్మోహన్ మృతితో శోకతప్తులైన కుటుంబ సభ్యులకు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులందరికీ డీఎంకే తరఫున, తమిళ ప్రజానీకం తరఫున స్టాలిన్ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. పదేళ్లపాటు యూపీఏ ప్రభుత్వంలో డీఎంకే భాగస్వామిగా ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ రాష్ట్రానికి చేసిన సేవలు, ప్రకటించిన పథకాలు గురించి తెలుపమంటూ మీడియా ప్రశ్నించగా, చెన్నై నగరవాసులంతా గుర్తించదగిన మెట్రోరైలు ప్రాజెక్టు అమలు కావటానికి మన్మోహన్ సింగే ప్రధాన కారకులని, అదే విధంగా నెమ్మేలి నిర్లవణీకరణ ప్రాజెక్టును మంజూరు చేశారని, వీటన్నింటి కంటే సేతుసముద్ర ప్రాజెక్టుకు కూడా శ్రీకారం చుట్టారని, అయితే వివిధ కారణాల వల్ల ఆ ప్రాజెక్టు మాత్రం అమలుకు నోచుకోలేదన్నారు. ఇలా రాష్ట్రాభివృద్ధికి మన్మోహన్‌సింగ్ ప్రకటించిన పథకాల జాబితా చాలా సుదీర్ఘమైనదని స్టాలిన్ అన్నారు. స్టాలిన్‌తో పాటు డీఎంకే ఎంపీలు టీఆర్‌బాలు, కనిమొళి, దయానిధి మారన్, ఎ.రాజా తిరుచ్చి శివ తదితరులు మన్మోహన్ సింగ్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

ఇదే విధంగా రాష్ట్రానికి చెందిన ప్రముఖ రాజకీయ నేతలు కూడా మన్మోహన్ సింగ్ మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ ప్రకటనలు జారీ చేశారు.

### మితభాషి, మృదుస్వభావి : వైగో

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అణకువకు మారుపేరని, ఆయన మితభాషి, మృదుస్వభావి అని ఎండీఎంకే నేత వైగో పేర్కొన్నారు. రిజర్వుబ్యాంక్ గవర్నర్‌గా ఉన్నప్పుడు ఇంటి నుంచి కార్యాలయానికి ఆఫీసు వాహనం ఉపయోగించకుండా సొంత కారులో వెళ్లేవారని తెలిపారు. ఆయన ఎక్కడ ప్రసంగించినా కటువైన పదజాలం ఉపయోగించరన్నారు. ఆయన మాటలమనిషి కాదని, చేతల మనిషి అని పేర్కొన్నారు.

### ప్రపంచం గర్వించదగ్గ ఆర్థికవేత్త...

మాజీప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రపంచం గర్వించదగిన ఆర్థికశాస్త్రవేత్త అని, ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ప్రగతిపథంలో నడిపించిన మహానాయకుడు అని టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై సంతాప సందేశంలో కీర్తించారు. ప్రస్తుతం ఆర్థిక ఒడిదిడుకులు లేకుండా ఆర్థిక పరిస్థితులు సుస్థిరంగా ఉండటానికి మన్మోహన్ సింగ్ వేసిన పునాదులే కారణమన్నారు.

### ఆర్థిక నిర్వహణలో మేటి...

భారత దేశ ఆర్థిక పరిస్థితులను చక్కగా నిర్వహించడంలో మన్మోహన్‌సింగ్ అందెవేసిన చేయి అని తమిళ మానిల కాంగ్రెస్ నేత జీకే వాసన్ అన్నారు. మన్మోహన్‌సింగ్ చేసిన సేవలు భారతీయులు మరువలేరన్నారు. ఇదే విధంగా అమ్మామక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, మాజీ ముఖ్యమంత్రి ఒ. పన్నీర్‌సెల్వం, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్, వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాందాస్, సీపీఐ నేత ముత్తరసన్, సీపీఎం నేత బాలకృష్ణన్, కాంగ్రెస్ మాజీ ఎంపీ తిరునావుక్కరసర్ తదితరులు మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం ప్రకటించారు.

# బంగాళాఖాతంలో 3 రోజుల్లో మరో అల్పపీడనం

చెన్నై, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో మూడు రోజుల్లో మరో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు తెలిపారు. దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతంలో ఏర్పడనున్న ఈ అల్పపీడనం మూడు రోజుల తర్వాత పడమటి దిశగా వాయువ్య బంగాళాఖాతంలో శ్రీలంకకు దక్షిణదిశగా కదలనుందన్నారు. ఈ అల్పపీడనం కారణంగా జనవరి 1, 2 తేదీల్లో సముద్రతీర జిల్లాల్లో పడమటి కనుమల సమీప జిల్లాలు, ఉత్తరాది జిల్లాల్లో చెదురుమదురుగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపారు. జనవరి 3 నుంచి 8 వరకు పలు ప్రాంతాల్లో మంచుకురుస్తుందని, కొడైకెనాల్, ఊటీ తదితర ప్రాంతాలను దట్టమైన మంచు కప్పేస్తుందని తెలిపారు. జనవరి 10న ఈశాన్య రుతుపవనాలు కూడా రాష్ట్రం నుండి వెళ్ళనున్నాయని తెలిపారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో మంచుకురవడం, చలిగాలులు వీస్తూ, తరచూ జల్లులు పడుతూ ఎండలు కూడా బాగా కాస్తాయని వివరించారు. ఇక ఉత్తరాది సముద్రతీర జిల్లాల వైపు దిశగా కేంద్రీకృతమైన తీవ్ర అల్పపీడనం పూర్తిగా బలహీనపడిందని, ఈ కారణంగా వచ్చే ఆరు రోజుల పాటు రాష్ట్రంలో అక్కడక్కడా జల్లులు పడతాయని వివరించారు. నగరానికి సంబంధించినంత వరకు ఆకాశం మేఘావృతమై ఉంటుందని, కొన్నిచోట్ల ఉరుములు మెరుపులతో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు తెలిపారు.

# రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదు

- బీజేపీ నేత అన్నామలై ఆందోళన
- కొరడాతో కొట్టుకుని వ్రతారంభం




తన నివాసం ఎదుట కొరడాతో కొట్టుకుంటున్న అన్నామలై - గుమికూడిన పార్టీ శ్రేణులు

చెన్నై, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోజురోజుకూ మహిళలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు అధికమవుతున్నాయని, పాలకులకు గులాములుగా మారిన పోలీసులు.. కళ్లెదుటే సాక్ష్యాలున్నా నేరాలను అరికట్టలేక ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆరోపించారు. అన్నా విశ్వవిద్యాలయం విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తూ శుక్రవారం బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకో జరపాలని పిలుపునిచ్చింది. అయితే భారత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి కారణంగా రాష్ట్రవ్యాప్త ఆందోళన వాయిదా వేసింది. కానీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై మాత్రం గురువారం ప్రకటించిన మేరకు శుక్రవారం తన ఇంటి ఎదుట ఆరుసార్లు కొరడాతో కొట్టుకుని మహిళలపై జరుగుతున్న వేధింపులను ఖండిస్తూ మండలంపాటు చేపట్టనున్న (నిరసన) దీక్షకు శ్రీకారం చుట్టారు. కోయంబత్తూరు సిత్రా- కాళపట్టి రహదారిలో ఉన్న తన నివాసం ఎదుట శుక్రవారం ఉదయం మురుగప్పెరుమాన్ భక్తుడిలా వేషధారణలో బయటకు రాగా, ఆయన ఇంటి సమీపంలో పార్టీ కార్యకర్తలు గుమికూడారు. వారంతా చూస్తుండగా అన్నామలై కొరడాతో కొట్టుకున్నారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన పార్టీ శ్రేణులను పట్టించుకోకుండా ఆరుసార్లు కొరడా ఝళిపించారు. ఈ దృశ్యాన్ని చూసిన మహిళా కార్యకర్తలు కంటతడిపెట్టుకున్నారు. అన్నామలై వారిని ఓదార్చి తనకు దేవుడే అండగా ఉంటాడని, మహిళల కోసం తాను చేపట్టిన వ్రతమిదన్నారు. ఆ తర్వాత ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. డీఎంకే పాలకులపై ఆగ్రహాన్ని వ్యక్తం చేయడానికో, వ్యక్తిగతమైన కక్షసాధింపు కోసమో తాను కొరడాను ఝళిపించలేదన్నారు. ఇకపై ప్రతి సభలోనూ డీఎంకే అవినీతిని ఎండగడతానని శపథం చేసేందుకే ఆరుసార్లు కొరడాతో కొట్టుకున్నానని, ఇలా కొరడాలతో కొట్టుకోవడం తమిళ సంప్రదాయంలో అంతర్భాగమేనని వెల్లడించారు.. ఈ కొరడాతో కొట్టుకున్న దెబ్బలను మురుగప్పెరుమాన్‌కే అంకితం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు దిగజారిపోతున్నాయని, ఆర్థిక పరిస్థితి బాగా లేదని, భవిష్యత్ తరాలు నాశనమవుతారని తెలిసి ఎలా మౌనంగా కూర్చోగలనని ఆయన ప్రశ్నించారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో తాను కూడా పోటీ చేస్తానని, ఆ ఎన్నికల్లో గెలిచినా ఓడినా క్రుంగిపోయే ప్రసక్తే లేదని, తమిళ ప్రజలందరికీ అండగా ఉండటమే తమ ధ్యేయమని చెప్పారు. లండన్‌కు వెళ్ళి ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఆరు నెలలపాటు చదివాక తాను మరింత మంచి మనిషిగా మారినట్లు చెప్పుకున్నారు. ప్రస్తుతం తన రాజకీయ వ్యవహారాలన్నీ తేటతెల్లంగా ఉన్నాయని, స్పష్టమైన దారిలోనే పార్టీ అభివృద్ధి దిశగానే పయనిస్తున్నానని అన్నామలై పేర్కొన్నారు.

# మన్మోహన్‌కు టీఎన్‌సీసీ నివాళి


మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీఎన్‌సీసీ నేతలు, కార్యకర్తలు

పెరంబూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ఆధ్వర్యంలో నివాళులర్పించారు. రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు తంగబాలు మాజీ ప్రధాని చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సాధారణ కుటుంబంలో జన్మించిన మన్మోహన్ గొప్ప ఆర్థికవేత్తగా నిలిచారని, ఆయన ఆర్థిక విధానాలు దేశంలో పేదరికం తగ్గించేందుకు దోహదపడ్డాయని కొనియాడారు. 1991 నుంచి 2014 వరకు ఆయన సేవలు దేశ చరిత్రలో స్వర్ణయుగమని, అపార జ్ఞానం, సమగ్రతో ఆయన దేశాన్ని నడిపించారన్నారు. పార్టీ గొప్ప మార్గదర్శకుడిని కోల్పోయిందని తంగబాలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హసన్ మౌలానా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గణపతి, భాస్కర్, టి.సెల్వం, జిల్లా ఆర్గనైజర్ ఎస్ఎం కుమార్ సహా పలువురు నేతలు, కార్యకర్తలు మన్మోహన్‌కు నివాళులర్పించారు.


కుటుంబ సభ్యులతో కలిసి మురుగన్ దర్శనం చేసుకుంటున్న గవర్నర్

# తిరుత్తణిలో గవర్నర్ పూజలు

తిరుత్తణి, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామిని గవర్నర్ ఆర్ఎన్ రవి కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్, జిల్లా ఎస్పీ శ్రీనివాస పెరుమాళ్, ఆలయ అధికారులు గవర్నర్‌కు సాదర స్వాగతం పలికారు. శ్రీవళ్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దర్శనానికి గవర్నర్ దంపతులు ప్రత్యేక మార్గంలో గర్భాలయానికి చేరుకున్నారు. పూజారులు ఆయనకు ఆలయ మర్యాదలతో సత్కరించి, ప్రసాదాలను అందించారు. గవర్నర్ దంపతుల పర్యటన సందర్భంగా ఎస్పీ నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు మూడు గంటలపాటు ఘాట్‌రోడ్‌లో వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు.

# 'పూండి' నుంచి అదనపు జలాల విడుదల

- కుశస్థలి సమీప ప్రాంతాలకు వరద హెచ్చరిక


పూండి జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

చెన్నై, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట సమీపంలోని పూండి జలాశయంలో ఇన్‌ఫ్లో విపరీతంగా పెరగటంతో ఆ జలాశయం నుండి అదనపు జలాలు విడుదల చేస్తున్నారు. ఈ కారణంగా కుశస్థలీ నదీతీర ప్రాంతం ప్రజలకు జలవనరుల శాఖ అధికారులు వరద హెచ్చరికలు జారీ చేశారు. నగరానికి తాగునీరందించే ఐదు జలాశయాల్లో ప్రధానమైన పూండి జలాశయంలో ఈశాన్య రుతుపవనాలు, ఫెంగల్ తుఫాన్ ప్రభావిత వర్షాలు కురవటంతో నీటిమట్టం వేగంగా పెరిగింది. దీంతో ఈ నెల 12 నుండి 18 వరకు అదనపు జలాలను విడుదల చేశారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి తిరుత్తణి, పళ్లిపట్టు తదితర నీటి పరివాహక ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురవటం, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాపురం ఆనకట్ట నుంచి సెకనుకు వెయ్యి ఘనపుటడుగుల చొప్పున జలాలను విడుదల చేశారు. దీనితో పూండి జలాశయానికి వచ్చే నీటి ప్రవాహం పెరిగింది. శుక్రవారం ఉదయం ఆరుగంటలకు ఆ జలాశయంలో సెకనుకు 1290 ఘనపుటడుగుల మేరకు నీరు రాగా, జలాశయంలో 35 అడుగుల వరకు నీటిని నిల్వచేయడానికి వీలుంది. ప్రస్తుతం నీటిమట్టం 34.92 అడుగులకు పెరగటంతో ఇరిగేషన్ అధికారులు డ్యాం భద్రత దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి రెండు గేట్ల ద్వారా సెకనుకు వెయ్యి ఘనపుటడుగుల చొప్పున జలాలను విడుదల చేశారు. జలాశయంలో ఇన్‌ఫ్లో తగ్గితే నీటి విడుదల పరిమాణాన్ని తగ్గిస్తామని అధికారులు తెలిపారు. ఇక పూండి జలాశయం నుంచి విడుదలవుతున్న జలాలు, తామరపాక్కం, కార్నోడై మీదుగా ప్రయాణించి ఎన్నూరు ప్రాంతంలో బంగాళాఖాతం కలుస్తుంది. ఈ కారణంగా కుశస్థలి నదీతీరంలో వరద పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. ఆ నదికి ఇరువైపులా ఉన్న నంబాక్కం, కృష్ణాపురం, ఆట్రంబాక్కం, ఒదప్పై, నైవేలి, ఎరయూరు, భీమన్‌తోప్పు, సొర్గతండలం, సోమదేవన్‌పట్టు, మెయ్యూరు, వెళ్ళియూరు, తామరైపాక్కం, తిరుగండటలం, ఆత్తూరు, పాండికావనూరు, జగన్నాధపురం. పుదుకుప్పం, కన్నిపాళయం, వన్నిపాక్క, మడియూరు, సీమావరం, వెళ్ళివాయల్‌కావల్, నాపాళయం, ఇడయన్‌చావడి, మనలి, మనలిపుదునగర్, సడయన్‌కుప్పం, ఎన్నూరు ప్రాంతాల్లో పల్లపు ప్రాంతాల ప్రజలకు వరద హెచ్చరికలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

## సమాచార దర్శిని

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా తిరువేర్కాడు, తేనాంపేట ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. **తిరువేర్కాడు:** పులియంబేడు మెయిన్ రోడ్డు, జడ్జి కాలని, రాజాస్ గార్డన్, నూంబల్, దేవి నగర్, బాలాజి నగర్, భాగ్యలక్ష్మి నగర్, పెద్ద వీధి, నూసై నగర్, అశోక్ నందవనం. **తేనాంపేట:** పోయస్ గార్డన్, టీవీ రోడ్డు, జయమ్మాళ్ రోడ్డు, ఇళంగో రోడ్డు, పోయస్ రోడ్డు ప్రాంతాలు, రాజకృష్ణ రోడ్డు, ఎల్డామ్స్ రోడ్డు, పెరియార్ రోడ్డు, కామరాజర్ రోడ్డు, కామరాజర్ వీధి, సీతమ్మాళ్ కాలని, కేపీ దాసన్ రోడ్డు, టీటీకే రోడ్డు, కథిడ్రల్ రోడ్డు, జేజే రోడ్డు, పార్థసారథి పేట, పార్థసారథి గార్డన్, కేఆర్ రోడ్డు, జేరోజ్ అవెన్యూ, ఎస్ఎస్ఐ రోడ్డు, హెచ్‌టీ రాజా రోడ్డు, ఏఆర్కే కాలని, అన్నాసాలై, వీనస్ కాలని, ముర్రేస్ గేట్ రోడ్డు.

### ఉపకారవేతనానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదిద్రావిడులు, గిరిజనులు, క్రైస్తవ ఆదిద్రావిడ విద్యార్థులకు ప్రీ మెట్రిక్ ఉపకారవేతనానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుత విద్యాసంవత్సరం కళాశాలల్లో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, గత ఏడాది దరఖాస్తు చేసుకోలేకపోయిన విద్యార్థులు https://umis.gov.in/ అనే వెబ్‌సైట్‌లో జనవరి 31వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.50 లక్షలు లోపు ఉండాలి. మరిన్ని వివరాలకు 18005997638 అను టోల్ ఫ్రీ నెంబరు సంప్రదించవచ్చు.

### అన్నా వర్శిటీ స్నాతకోత్సవం వాయిదా

పెరంబూర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో జరగాల్సిన స్నాతకోత్సవం వాయిదాపడింది. ఈ వర్శిటీ పరిధిలోని ఐదు కళాశాలల్లో శనివారం స్నాతకోత్సవం జరుగుతుందని ఇదివరకే ప్రకటించారు. ఈ నేపథ్యంలో, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిచెందిన కారణంగా స్నాతకోత్సవం వాయిదావేసినట్లు, తదుపరి నిర్వహించాల్సిన తేది త్వరలో ప్రకటిస్తామని వర్శిటీ ప్రకటన విడుదల చేసింది.

### నవజ్యోతిర్లింగ సందర్శనకు ప్రత్యేక రైలు

పెరంబూర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మదురై నుంచి చెన్నై మార్గంగా నవజ్యోతిర్లింగ సందర్శనకు ప్రత్యేక రైలు నడుపనున్నారు. మదురై నుంచి ఫిబ్రవరి 18వ తేది బయల్దేరనున్న ఈ యాత్రలో మల్లికార్జునుడు, పార్లి వైద్యనాథ్, ఔంధ నాగనాథ్, కృష్ణేశ్వర్, భీమశంకర్, త్రయంబకేశ్వర్, సోమనాథ్, మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్లను దర్శించుకోవచ్చు. 12 రోజుల యాత్రకు 3 టైర్ ఏసీలో ఒకరికి రూ.35,500, సెకండ్ క్లాస్‌లో ఒకరికి రూ.25,700గా నిర్ణయించారు. మరిన్ని వివరాలకు 7305858585 అనే నెంబరు సంప్రదించవచ్చు.

### రూ.30 కోట్లతో నామక్కల్ కవింజర్ మాలిగై ఆధునికీకరణ

పెరంబూర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయంలో పదంతస్తులతో ఉన్న నామక్కల్ కవింజర్ మాలిగై 1975లో నిర్మించారు. ఇటీవల ఈ భవనంలో టైల్స్‌లో పేలుడు సంభవించిన ఘటన కలకలం రేపింది. దీంతో, ఈ భవనం ఆధునీకీకరణకు ప్రజాపనుల శాఖ రూ.30 కోట్లతో సిద్ధం చేసి ప్రణాళికకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. వచ్చే ఏడాదిలో పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

### 30న హనుమాన్ జయంతి వేడుకలు

ఐసిఎఫ్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక నన్మంగళంలోని వీరమంగళ ఆంజనేయ ఆలయంలో 21వ వార్షిక హనుమాన్ జయంతి వేడుక సోమవారం నిర్వహించనున్నారు. వేడుకల్లో భాగంగా 29వ తేదీ మూలమంత్ర హోమం, 30వ తేది ఉదయం ఉత్సవర్లు, స్వామికి తిరుమంజనం చేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

### ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే చర్యలు

పెరంబూర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే చర్యలు చేపడతామని ప్రైవేటు పాఠశాలల డైరెక్టరేట్ హెచ్చరించింది. ప్రస్తుత విద్యా సంవత్సరం అర్థవార్షిక పరీక్షలు ముగిసి, ఈ నెల 23వ తేది నుంచి జనవరి 1వ తేది వరకు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో కొన్ని ప్రైవేటు పాఠశాలలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాయంటూ తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తున్నారు. దీనిపై స్పందించిన ప్రైవేటు పాఠశాలల డైరెక్టరేట్, సెలవు రోజుల్లో ప్రైవేటు పాఠశాలల్లో తరగతులు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై చర్యలు చేపడతామని హెచ్చరించింది.

### నలుగురు ఏఎస్పీల బదిలీ

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నలుగురు అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ శంకర్ జివాల్ ఉత్తర్వులు జారీచేశారు. తిరువణ్ణామలై జిల్లా మహిళలు, పిల్లల నేరాల నిరోధక విభాగం అదనపు ఎస్పీగా పనిచేస్తున్న సౌందర్‌రాజన్, నీలగిరి జిల్లా హెడ్ అడిషనల్ ఎస్పీగా బదిలీ అయ్యారు. నీలగిరి జిల్లా అదనపు ఎస్పీ తంగవేల్ కాంచీపురం జిల్లా సైబర్ క్రైం అదనపు ఎస్పీగాను, కరూర్ జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో అదనపు ఎస్పీగా ఉన్న ప్రేమానందన్ కోయంబత్తూర్ జిల్లా హెడ్‌క్వార్టర్స్ అదనపు ఎస్పీగాను, కళ్లకుర్చి జిల్లా మహిళలు, పిల్లల నేరాల నిరోధక విభాగం అదనపు ఎస్పీ మణికంఠన్ నీలగిరి జిల్లా సైబర్ క్రైం అదనపు ఎస్పీగా బదిలీ అయ్యారు.

# కెప్టెన్ ఆలయంలో నేడు గురుపూజోత్సవం

● హాజరుకానున్న రాజకీయ నేతలు



టి.నగర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమిళ ప్రజానీకం 'కెప్టెన్' అంటూ ఆప్యాయంగా పిలిచే విజయకాంత్ కనుమరుగై అప్పుడే యేడాది గడిచింది. ఈ శనివారం విజయకాంత్ ప్రథమవర్థంతిని కోయంబేడులోని 'కెప్టెన్' ఆలయంలో నిర్వహించడానికి డీఎండీకే నాయకులు, పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. కోయంబేడులోని డీఎండీకే ప్రధాన కార్యాలయం (కెప్టెన్ ఆలయం)లో జరుగనున్న ఈ గురుపూజోత్సవానికి డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సహా రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల నేతలను విజయకాంత్ బావమరిది ఎల్కే సుదీష్, కుమారుడు విజయ ప్రభాకరన్ కలిసి ఆహ్వానించారు. తమిళ చిత్రసీమ నుంచి రాజకీయ ప్రవేశం చేసిన కరుణానిధి, ఎంజీఆర్, జయలలిత ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. ఈ ముగ్గురి బాటలో విజయకాంత్ కూడా చిత్రసీమ నుండి రాజకీయాల్లోకి వచ్చారు. 2005లో 'దేశియ ముర్పోక్కు ద్రావిడ కళగం' పేరుతో అట్టహాసంగా రాజకీయ పార్టీని ప్రారంభించారు. 2006లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా బరిలోదిగి అన్ని నియోజకవర్గాల్లోనూ ఊహించనంత ప్రజాభిమానంతోపాటు ప్రత్యేక ఓటు బ్యాంక్ కూడా సంపాదించుకున్నారు. ఆ ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థుల ఓటమికి కారణమైందని రాజకీయ పరిశీలకులు ప్రకటించారు. ఈ అంశాన్ని పరిశీలించిన అన్నాడీఎంకే అధినేత్రి జయలలిత 2011 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎండీకేతో పొత్తుకుదుర్చుకుని పోటీకి దిగారు. ఆ ఎన్నికల్లో డీఎండీకే ఎవరూ ఊహించనంతగా సీట్లను గెలుచుకోవడమే కాకుండా ప్రధాన ప్రతిపక్షంగా ఏర్పడింది. ఆ తరవాత అప్పటి ముఖ్యమంత్రి జయలలితతో మనస్పర్థలు రావటం, శాసనసభలో అన్నాడీఎంకే సభ్యులతో గొడవపడటం వంటి ఘటనల కారణంగా విజయకాంత్ పతనస్థితి ప్రారంభమైంది. 2016లో సీపీఐ, సీపీఎం, ఎండీంకేలతో మెగా కూటమి ఏర్పాటుచేసుకున్న డీఎండీకే ఘోరపరాజయాన్ని చవిచూసింది. ఆ ఎన్నికల్లో విజయకాంత్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించి మరీ ఆ కూటమి ఎన్నికల బరిలో దిగి మట్టికరచింది. ప్రధాన ప్రతిపక్షం స్థాయికి ఎదిగిన డీఎండీకే హఠాత్తుగా శూన్యంలోకి చేరింది. ఆ ఘోరపరాజయమే ఆయనను మానసికంగా క్రుంగదీసి తీవ్ర అనారోగ్యాన్ని తెచ్చిపెట్టింది. ఆ తరువాత విదేశాల్లో చికిత్స పొందినప్పటికీ ఆయనలో గత చురుకుదనం లోపించింది. మాట కరువైంది. ఇంటిపట్టునే ఉంటూ చికిత్స చేయించుకున్నారు. తరచూ పార్టీ శ్రేణుల కోసం విజయకాంత్‌ను కోయంబేడులోని పార్టీకార్యాలయానికి ఆయన సతీమణి ప్రేమలత తీసుకొచ్చేవారు. ఎంజీఆర్ లాగే విజయకాంత్ గుప్తదానాలకు పెట్టింది పేరు. కోలీవుడ్‌లో హీరోగా నిలదొక్కుకుంటున్నప్పుడు గానీ, హీరోగా ఉన్నత స్థాయికి చేరుకున్నప్పుడు గానీ టినగర్ రాజాబాదర్ స్ట్రీట్‌లోని తన కార్యాలయానికి రోజూ సినీ ఛాన్సుల కోసం వచ్చేవారికే కాకుండా ఆకలితో వచ్చే నిరుపేదలకు కూడా చక్కటి భోజనసదుపాయం కల్పించేవారు. తీవ్ర అనారోగ్యంతో ఇంటిపట్టునే ఉన్న విజయకాంత్‌ను తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్, సుప్రీం స్టార్ శరత్‌కుమార్, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్, అన్నాడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామి తదితర రాజకీయ ప్రముఖులంతా వెళ్ళి పరామర్శిస్తుండేవారు. మళ్ళీ విజయకాంత్ మునుపటిలా సంపూర్ణ ఆరోగ్యంతో పార్టీ వ్యవహారాలను నిర్వర్తిస్తారని అందరూ అనుకుంటుండగానే గత యేడాది డిసెంబర్ 28న కన్నుమూసి అందరిని శోకసముద్రంలోకి నెట్టారు. ఆయన అంత్యక్రియలకు హాజరైన జనాన్ని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. అన్నాదురై, ఎంజీఆర్ అంత్యక్రియలకు హాజరైనవారి కంటే అధిక జనం అంతిమయాత్రలో పాల్గొనటం విశేషం.






**రోజూ అన్న సంతర్పణ..**

కోయంబేడు పార్టీ కార్యాలయం వద్దే విజయకాంత్ భౌతికకాయాన్ని ఖననం చేసి అందమైన సమాధి నిర్మించారు. ఆ సమాధిని దర్శించేందుకు వచ్చేవారి కోసం క్యూలైన్ కూడా నిర్మించారు. విజయకాంత్ సమాధి, దానికి చేరువ గానే ఆయన నిలువెత్తు కాంస్యవిగ్రహం కూడా పెట్టారు. ఆ సమాధి స్థలం యేడాదిగా కెప్టెన్ అభిమానులకు, పార్టీ శ్రేణులకు ఆలయంగా మారిందంటే అతిశయోక్తి కాదు. ఇక్కడకు రోజూ వచ్చేవారికి తప్పనిసరిగా అన్నపానీయాలు సమకూర్చుతున్నారు. ప్రతిరోజూ ఆయన సమాధి వద్ద వివిధ రకాల పూజలు నిర్వహిస్తున్నారు. ఆయన సమాధిని దర్శనం చేసుకుంటే మానసిక ప్రశాంతత చేకూరుతోందని పార్టీ శ్రేణులు చెబుతున్నారు.

ఇప్పటికీ మా పాలిటదేవుడు విజయకాంతేనని పేర్కొంటున్నారు. పార్టీలో లక్షల సంఖ్యలో కెప్టెన్ వీరాభిమానులు ఉన్నారు. వీరి పట్ల విజయకాంత్‌లాగే పార్టీని నడుపుతున్న ప్రేమలత ఆదరాభిమానాలను అందిస్తున్నారు. దీనివలన కెప్టెన్ ఆలయాన్ని రోజూ దర్శించే వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం కెప్టెన్ గురుపూజోత్సవం అత్యంత వైభవంగా జరుగనుంది. ఏ సిద్ధాంతాలతో కెప్టెన్ పార్టీని ప్రారంభించారో ఆ సిద్ధాంతాలను ఆచరించి ఆయన లక్ష్యాలను సాధించేందుకు డీఎండీకే శ్రేణులంతా కలిసి కట్టుగా ముందుకు సాగాల్సి ఉంది. పార్టీ నాయకురాలు ఆ దిశగా పార్టీని నడిపిస్తారని వీరంతా ఆశిస్తున్నారు.

# అత్యాచారం కేసు సీబీఐకి అప్పగించండి

● ఈపీఎస్ డిమాండ్

చెన్నై, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయం విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసు విచారణ సీబీఐకి అప్పగించాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) డిమాండ్ చేశారు. నగరంలో శుక్రవారం మధ్యాహ్నం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. అన్నావర్శిటీలో విద్యార్థినిపై జరిగిన అత్యాచారం రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, డీఎంకే పాలనలో మహిళలకు ఏ మాత్రం రక్షణ లేదని ఈ సంఘటన రుజువు చేస్తోందని చెప్పారు. అంతేగాకుండా ఈ అత్యాచారం కేసులో అరెస్టయిన నిందితు జ్ఞానశేఖరన్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు సంబంధాలున్నాయని ఆరోపిస్తూ ఈపీఎస్ ఓ ఫొటో చూపించారు..ఆఫొటోలో స్టాలిన్ పక్కనే నిందితుడు, ఆయన భార్య ఉన్నారని ఈపీఎస్ పేర్కొన్నారు. అన్నా యూనివర్శిటీలో విద్యార్థినులకు రక్షణ కల్పించేందుకు డీఎంకే ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఆ యూనివర్శిటీలోని 70 సీసీ కెమెరాలలో 56 మాత్రమే పనిచేస్తున్నట్టు పోలీసు అధికారులే చెబుతున్నారన్నారు. నిందితుడు జ్ఞానశేఖరన్ ఫోన్‌లో మాట్లాడుతున్న సార్ ఎవరో పోలీసులు వెల్లడించకుండా గోప్యంగా ఉంచారని ఈపీఎస్ ఆరోపించారు. బాధితురాలి వాంగ్మూలంతో నమోదైన ఎఫ్ఐఆర్ ఎలా బహిర్గతమైందన్న విషయంపై ఎవరూ నోరుమెదపటం లేదని, నిందితులను కఠినంగా శిక్షిస్తామంటూ ప్రజలను మభ్యపుచ్చుతున్నారని పేర్కొన్నారు. పోలీసు కమిషనర్ అరుణ్ చెబుతున్న వివరాలకు, ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ వెల్లడించిన వివరాలకు ఏ మాత్రం పొంతనలేదన్నారు. ఈ కేసుతో పాలకపక్షానికి చెందిన ప్రముఖుడికి సంబంధాలు ఉండటం వల్లే ఆ వ్యక్తిని కాపాడేలా పోలీసు అధికారులు ప్రవర్తిస్తున్నారని చెప్పారు. అత్యాచారానికి పాల్పడే దోషులను కఠినంగా శిక్షించడానికి బదులు డీఎంకే పాలకులు మెతకవైఖరిని అవలంభిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా అన్నావర్శిటీ విద్యార్థినిపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ విద్యార్థులు శుక్రవారం ధర్నా జరిపారు.






మీడియా సమావేశంలో ఓ ఫొటోను ప్రదర్శిస్తున్న ఎడప్పాడి - అన్నా విశ్వవిద్యాలయం ఎదుట విద్యార్థుల ధర్నా

## అన్నామలై చేసేవన్నీ జిమ్మిక్కులే


● డీఎంకే నేత ఆర్ఎస్ భారతి

పెరంబూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొరడాతో కొట్టుకోవడం, చెప్పులు వేసుకోనని చెప్పడం లాంటి రాజకీయ జిమ్మిక్కులకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పాల్పడుతున్నారని డీఎంకే ప్రిసీడియం ఛైర్మెన్ ఆర్ఎస్ భారతి ఆరోపించారు. తేనాంపేటలోని అన్నా అరివాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... అన్నా వర్శిటీలో జరిగిన అత్యాచారంపై విద్యార్థిని ఫిర్యాదు చేసిన గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు. నిందితుడికి డీఎంకేకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తాజాగా, అన్నామలై కొరడాతో కొట్టుకుంటున్నారని, అటువంటివి ఆ పార్టీ నేతలే అంగీకరించడం లేదన్నారు. డీఎంకేను గద్దె దింపేంత వరకు పాదరక్షలు ధరించనని అన్నామలై పేర్కొంటున్నారని, ఆ ప్రకారం, ఆయన జీవితాంతం పాదరక్షలు లేకుండా నడుస్తారని ఆర్ఎస్ భారతి ఎద్దేవా చేశారు.

### ఎలైట్ మద్యం దుకాణంలో రూ.1.36 కోట్ల అవినీతి

పెరంబూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎలైట్ మద్యం దుకాణంలో రూ.1.36 కోట్ల అవినీతికి పాల్పడిన దుకాణ సూపర్‌వైజర్, ఐదుగురు సేల్స్‌మాన్‌ను అధికారులు విచారిస్తున్నారు. నగర శివారు ప్రాంతమైన నావలూరులోని టాస్మాక్ ఎలైట్ మద్యం దుకాణంలో హోల్‌సేల్ విక్రయాలు చేస్తుంటారు. ఇటీవల అధికారులు దుకాణాన్ని తనిఖీ చేయగా, దుకాణంలో స్టాక్‌కు, విక్రయించినట్లు చూపుతున్న స్టాక్‌కు మధ్య తేడా గుర్తించారు. ఈ విషయమై ఉన్నతాధికారుల విచారణలో.. సుమారు రూ.1.36 కోట్ల మద్యం విక్రయాలు జరుగగా, ఈ నగదు ప్రభుత్వ ఖాతాకు జమకాలేదని తెలిసింది.ఈ విషయమై దుకాణ సూపర్‌వైజర్ సెల్వకుమార్, ఐదుగురు సేల్స్‌మెన్లను అధికారులు విచారిస్తున్నారు.

### డీఎంకే వైఖరికి నిరసనగా పీఎంకే ఆందోళన



ఆందోళనలో వన్నియర్లు

వేలూరు,డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): గుడియాత్తం తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం పీఎంకే ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వన్నియర్లకు రిజర్వేషన్ ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని,ఈతీర్పు వెలువడి 1,000రోజులు గడిచినా డీఎంకే ప్రభుత్వం అమలుచేయడంలో నిర్లక్ష్యమైందని పీఎంకే నేతలు ఆరోపించారు.

### మన్మోహన్‌సింగ్ మృతికి ద్రావిడ దేశం సంతాపం

ఐసిఎఫ్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక శాఖ మంత్రిగా, పదేళ్లపాటు ప్రధానిగా ఆర్థిక సంస్కరణలు చేపట్టి, దేశాన్ని అనతికాలంలోనే పురోగమనదిశలో పయనింపజేసిన గొప్ప వ్యక్తి మన్మోహన్‌సింగ్ అని ద్రావిడ దేశం అధ్యక్షులు కృష్ణారావు కొనియాడారు. ఈ మేరకు ఓ సందేశం వెలువరిస్తూ ఎంతటి ఉన్నత పదవులు వరించినా నిరాడంబరంగా వ్యవహరించిన వ్యక్తి ఆయనేనని, తాను సభ్యుడిగా ఉన్న 'ఇండియా నెక్స్‌ట్' అనే సంస్థ ద్వారా 2019లో ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో 'ది బెస్ట్ లీడర్ ఆఫ్ ఇండియా' అవార్డును ప్రదానం చేశామని, ఆ సభలో మన్మోహన్ సింగ్‌తోపాటు ఆ సభలో పాల్గొనే అదృష్టం దక్కిందన్నారు. ఆ మహానేత మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాని ఆ సందేశంలో పేర్కొన్నారు.

## ఆమె నేత్రాలు సజీవం



శాంతిభాయ్ (ఫైల్‌ఫొటో)

వేలూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సంఘం ప్రముఖుడు లక్ష్మీచంద్ జైన్ సతీమణి శాంతిభాయ్ (62) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందింది. ఆమె నేత్రాలు సీఎంసీ ఆస్పత్రికి దానంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నేత్రదాన కమిటీ అధ్యక్షుడు రమేష్‌కుమార్ జైన్, కాట్పాడి రెడ్‌క్రాస్ శాఖ అధ్యక్షుడు జనార్థనన్ తదితరులు పాల్గొన్నారు. కాట్పాడి రెడ్‌క్రాస్, వేలూరు జేసీస్ సంఘం, ఫ్రీడమ్స్ సిటీ లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఇప్పటివరకు 145 మంది నుంచి నేత్రాలు దానంగా పొందినట్లు నిర్వాహకులు తెలిపారు.

## నగరం, శివారు ప్రాంతాల్లో సబ్ స్టేషన్లు

పెరంబూర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరం, శివారు ప్రాంత ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ అందించేలా ఐదు ప్రాంతాల్లో ఉప విద్యుత్ కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి. ఈ కేంద్రాల ఏర్పాటుకు అనువైన స్థలాన్ని విద్యుత్ బోర్డు ఎంపిక చేసింది. ఆ ప్రకారం పోరూర్ రామాపురం, చెంగల్పట్టు జిల్లా గుడువాంజేరి పెరుమాట్టునల్లూర్, కాంచీపురం జిల్లా కట్టవాక్కం తదితర ప్రాంతాల్లో 110/11 కిలో వాట్ సామర్థంతో తలా ఒక ఉప విద్యుత్ కేంద్రం, కాంచీపురం జయంపేట, చెంగల్పట్టు హస్తినాపురంలో తలా 33/11 కిలో వాట్ సామర్థ్యం కలిగిన రెండు ఉప విద్యుత్ కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## పాఠశాల మూసివేతను నిరసిస్తూ ఆందోళన



ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా మోగనూరులో సేలం సహకార చక్కెర కర్మాగారం మెట్రిక్ మహోన్నత పాఠశాల 1978 నుంచి పనిచేస్తోంది. ఈ నెల 19న విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించిన పాఠశాల యాజమాన్యం, పాఠశాల మూసివేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసిందని, అందువల్ల జనవరి నుంచి మీ పిల్లలను ఇతర పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. పాఠశాల మూసివేస్తే పిల్లల చదువు మధ్యలోనే ఆగిపోతుందన్న తల్లిదండ్రులు, గురువారం కర్మాగారం ప్రధాన కార్యాలయం వద్ద పిల్లలతో కలసి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం తన ప్రకటన సత్వరం ఉపసంహరించుకోవడంతో పాటు పాఠశాలల్లో వసతులు కల్పించాలని తల్లిదండ్రులు నినాదాలు చేశారు.

## రైతు సమస్యల పరిష్కార సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం రైతు సమస్యల పరిష్కార సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి గురుస్వామి, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ సెందిల్‌కుమరన్, సహకార సంఘాల జాయింట్ రిజిస్ట్రార్ తిరుగుణ అయ్యప్పదురై, వేలూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ జాయింట్ రిజిస్ట్రార్ రాందాస్, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ తేన్‌మొళి, రెవెన్యూ తహసీల్దార్లు సుబ్రమణ్యన్, సుబలక్ష్మి, పంచాయతీల అసిస్టెంట్ డైరెక్టర్ ఉమ, పౌరసరఫరాల శాఖ అధికారి సుమతి సహా పలు శాఖల అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తి అరెస్ట్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తోటలో గంజాయి మొక్కలు సాగుచేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈరోడ్ జిల్లా తాళవాడి సమీపం సూసైపురం గ్రామంలోని ఓ తోటలో గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు తాళవాడి పోలీసులకు సమాచారం అందింది. దీంతో, పోలీసులు తనిఖీలు చేపట్టి, నాలుగు గంజాయి మొక్కలు గుర్తించి ధ్వంసం చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదుచేసిన పోలీసులు సుబ్రమణిని అరెస్ట్ చేశారు.

● 'మంచి దొంగ'

## చోరీ చేసిన ఇంటికే చేరిన నగలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చోరీ చేసిన నగలను వాటిని చోరీ చేసిన ఇంటిలోనే విసిరేసి వెళ్ళిన ఓ మంచి దొంగ ఉదంతం తిరునల్వేలి జిల్లాలో జరిగింది. కూడన్‌కుళం సమీపం ఇడిందకరై ప్రాంతానికి చెందిన ఫ్రాన్సిస్, క్రిస్మస్ రోజున ఇంటికి తాళాలు వేసి చర్చికి వెళ్లాడు. ఇంటికి వచ్చి చూడగా, బీరువాలోని 14 సవర్ల నగలు అదృశ్యం కావడం గుర్తించాడు. ఫ్రాన్సిస్ ఫిర్యాదుపై కేసు నమోదుచేసిన కూడన్‌కుళం పోలీసులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో, గురువారం సాయంత్రం ఆ మంచి దొంగ చోరీ చేసిన 14 సవర్ల నగలతో కూడిన మూటను ఇంట్లో వేసి వెళ్లడంతో, ఫ్రాన్సిస్ సంతోషానికి పట్టపగ్గాలు లేకపోయింది.

## మాంజా దారం విక్రయాలపై నిషేధం పొడిగింపు

పెరంబూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో మాంజా దారం తయారీ, విక్రయాలపై విధించిన నిషేధం, మరో రెండు నెలలు పొడిగించారు. నగరం, శివారు ప్రాంతాల్లో మాంజా దారం వినియోగించి గాలిపటాలు ఎగురవేయడంపై నిషేధం అమలులో ఉంది. ఈ నిషేధం ఈ నెల 23వ తేదీతో ముగిసిన నేపథ్యంలో, ఫిబ్రవరి 23 వరకు నిషేధం పొడిగిస్తూ గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

## కేంద్ర ప్రభుత్వం పేరిట నకిలీ ప్రకటనలు నమ్మొద్దు

ప్యారీస్, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం పేరుతో సామాజిక మాధ్యమాల్లో వచ్చే నకిలీ పోస్టులను ప్రజలు నమ్మరాదని, సైబర్ క్రైమ్ పోలీసు శాఖ హెచ్చరించింది. సాంకేతిక పరిజ్ఞానంతో కొంతమంది సంఘ విద్రోహులు సామాజిక మాధ్యమాల్లో కేంద్రప్రభుత్వం పేరుతో నకిలీ ప్రకటనలు పోస్ట్ చేసి ప్రజల నుండి డబ్బులు దండుకుంటున్న వ్యవహారంపై సైబర్ క్రైమ్ దృష్టిసారించింది.. ఈ తరహా ప్రకటనలను నమ్మొద్దని, అయినా కొంతమంది ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోతో పాటు, కేంద్రమంత్రుల ఫొటోలు లోగోలతో కూడిన వెబ్‌సైట్లను రూపొందించి, భారత్ జన్ యోజన ద్వారా ప్రజలందరికీ రూ.5వేల చొప్పున మీ బ్యాంక్ అకౌంట్లలో పడేందుకు కోసం ఇప్పుడే రిజిస్టర్ చేసుకోండి! అని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇలా చేస్తున్న ప్రచారాన్ని నమ్మి ఆ నకిలీ సంస్థల వెబ్‌సైట్ లింక్స్ జోలికి వెళ్లొదని, ఎవరైనా మీ ఫోన్ వాట్సాప్ నెంబర్లకు మెసేజ్ చేస్తే స్పందించవద్దని పోలీసులు సూచించారు. అంతే కాకుండా వెబ్‌సైట్ లింకుల ద్వారా క్యాష్ బ్యాక్ పొందడానికి 'మాయా చిలుక' చిత్రాన్ని క్లిక్ చేయండి! అనే మరో ప్రకటన కూడా సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోందని దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.

అత్యాచారాన్ని ఖండిస్తూ ధర్నా..

## బీజేపీ, అన్నాడీఎంకే శ్రేణులపై కేసు

ప్యారీస్, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నా యూనివర్సిటీ విద్యార్థినిపై ఇటీవల జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ అనుమతిలేకుండా ధర్నా చేసిన అన్నాడీఎంకే, బీజేపీ పార్టీలకు చెందిన సుమారు 1500 మందిపై నగర పోలీసులు కేసు నమోదు చేశారు. అత్యాచారం కేసులో జ్ఞానశేఖరన్ అనే వ్యక్తిని అరెస్ట్ చేయగా, నిందితుడు అధికార డీఎంకే పార్టీకి చెందిన వ్యక్తి అని, ఉన్నత విద్యా సంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులకు రక్షణ కల్పించడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ అన్నాడీఎంకే, బీజేపీ నిర్వాహకులు అనుమతి లేకుండా గురువారం నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో ధర్నా నిర్వహించారు. ముందే ప్రకటించకుండా చేపట్టిన ఈ ఆందోళన కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని, అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో పెద్ద సంఖ్యలో గుమికూడటం చట్ట విరుద్ధమన్న పోలీసులు ఆ రెండు పార్టీలకు చెందిన 1500 మందిపై కేసు నమోదు చేశారు.

## వేర్వేరు ఘటనల్లో రైళ్లు ఢీకొని ఇద్దరి మృతి

ఐసిఎఫ్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైలుపట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని ఇద్దరు మృతిచెందారు. తిరువళ్లూర్ జిల్లా కడంబత్తూర్ సెంజంబాక్కం రైల్వేస్టేషన్ పరిధిలో గురువారం సుమారు 60 ఏళ్ల వృద్ధురాలు పట్టాలు దాటుతూ రైలు ఢీకొనడంతో మృతిచెందింది. మరో ఘటన మనవూరు తిరువలంగాడు రైల్వేస్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. సుమారు 45 ఏళ్ల వయస్సు వ్యక్తి రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనలపై రైల్వే పోలీసులు కేసులు నమోదుచేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## చిరుత దాడిలో ఏడు మేకలు మృతి

వేలూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిరుత దాడిలో మేకలు మృతిచెందగా, మరో రెండు ఆవులకు గాయాలయ్యాయి. చిరుతపులిని బంధించేందుకు ఆరు రోజులుగా అటవీ సిబ్బంది శ్రమిస్తున్నారు. ఈ నెల 18న ఇంట్లో చొరబడిన చిరుత ఓ యువతిని హతమార్చింది. ఈ క్రమంలో, పరదరామి సమీపం అర్పు గ్రామంలో శివలింగం అనే రైతుకు చెందిన ఏడు మేకలను హతమార్చి చంపిన చిరుత రెండు ఆవులను గాయపరిచింది. వెంటనే చిరుతపులిని బంధించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## లంచం ఆశించిన సర్వేయర్ అరెస్ట్

ఐసిఎఫ్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇంటి పట్టా మంజూరుకు లంచం ఆశించిన సర్వేయర్ కటకటాలపాలయ్యాడు. స్థానిక ఆవడి తహసీల్దార్ కార్యాలయంలో సుమన్ సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. పట్టాభిరామ్ గోపాలపురానికి చెందిన చంద్రన్‌కు అదే ప్రాంతంలో ఇంటి స్థలం ఉంది. ఈ స్థలానికి పట్టా కావాలని కోరుతూ చంద్రన్ ఆవడి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. పట్టా మంజూరుకు రూ.15వేలు ఇవ్వాలని సర్వేయర్ సుమన్ డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో చంద్రన్, జిల్లా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు చంద్రన్ గురువారం రసాయనం పూసిన నోట్లను అందిస్తుండగా, అక్కడే మాటువేసిన అధికారులు అతనిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సుమన్‌కు సహాయంగా ఉన్న తిరువళ్లూర్ జిల్లా మేయూర్ ప్రాంతానికి చెందిన ఏజెంట్ పొన్నయ్యన్‌ను కూడా అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## ప్లాస్టిక్ పరిశ్రమను ఆదుకోవాలి

● టాన్పా అధ్యక్షుడు శంకరన్




చెన్నై ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న శంకరన్, రాజా తదితరులు

ప్యారీస్, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఛార్జీలు, జీఎస్టీ తగ్గించి రాష్ట్రంలో ప్లాస్టిక్ పరిశ్రమను ఆదుకోవాలని తమిళనాడు పాండి ప్లాస్టిక్ అసోసియేషన్ (టాన్పా) అధ్యక్షుడు జి.శంకరన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. చేపాక్‌లోని చెన్నై ప్రెస్‌క్లబ్‌లో శనివారం టాన్పా, తమిళనాడు వ్యాపారుల సంఘాల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా శంకరన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్లాస్టిక్ పరిశ్రమలపై ఆధార పడి ప్రత్యక్షంగా ఐదు లక్షల మంది, పరోక్షంగా ఆరు లక్షల మంది జీవిస్తున్నారని తెలిపారు. వీరే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి లైసెన్సు పొందిన సుమారు 8వేలకు పైగా సంస్థలు చిన్నా, మధ్య తరగతి పరిశ్రమలు పని చేస్తున్నాయని, ఈ వృత్తిపై ఆధార పడిన కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రప్రభుత్వం అద్దె భవనాలకు విధించిన 18శాతం జీఎస్టీని రద్దు చేయాలని, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌కు చెందిన ఈడీ అధికారుల బృందం ఫ్లాగ్‌డే విధుల పేరుతో రూ.5వేలు వసూళ్లు చేయడాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. స్థానిక సంస్థల ఆధీనంలో ఉన్న కార్పొరేషన్, మున్సిపాలిటీ యూనియన్, పంచాయితీల ద్వారా విధించే ఆస్తి పన్ను పెంపు, వృత్తి లైసెన్సు ఫీజు కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాజా, కందన్, వీర్ మహమ్మద్, వ్యాసై మణి తదితరులు పాల్గొన్నారు.

మరో ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో కలిసొచ్చే పార్టీల కోసం ఎత్తులు, పొత్తుల వ్యూహంతోనే ఈ ఏడాది రాజకీయాలు సాగిపోయాయి. అధికార పార్టీలో అధినేత వారసుడెవరో స్పష్టంగా తేలిపోగా, ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకేలో ఇంకా వారసత్వపోరు కొనసాగుతూనే వుంది. అధికారాన్ని నిలబెట్టుకోవడమే పరమావధిగా డీఎంకే పావులు కదుపుతుండగా, ప్రభుత్వ వ్యతిరేకతే తమను గట్టెక్కిస్తుందన్న ఆశతో అన్నాడీఎంకే అడుగులు వేస్తోంది. మిగిలిన చిన్నపార్టీలు ఎప్పటిలానే తమకు కలిసొచ్చే కూటమి ఏదో బేరీజు వేసుకుంటుండగా, రాష్ట్ర రాజకీయాల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రముఖ సినీ తార విజయ్ తళుక్కుమన్నారు. దీంతో ఈ సారి అసెంబ్లీ ఎన్నికలు ఆషామాషీగా ఉండబోవన్న ఉత్కంఠతోనే రాష్ట్ర రాజకీయాలు కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి, చెన్నై






# అసెంబ్లీ ఎన్నికలకు వ్యూహ రచన

## ■ డీఎంకేలో వారసుడిపై స్పష్టత



అధికార డీఎంకేలో వారసుడిపై ఈ ఏడాది స్పష్టత వచ్చేసింది. కరుణానిధి జీవించివుండగా, ఆయన వారసుడెవరన్నదానిపై వివాదాలు తలెత్తిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం కాస్తా అటు పార్టీలోనూ, ఇటు కరుణ కుటుంబంలోనూ చిచ్చురేపింది. దీంతో పెద్దకుమారుడు, కేంద్రమాజీమంత్రి ఎంకే అళగిరి, చిన్నకుమారుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కొన్నేళ్ల పాటు కనీసం ముఖాలు కూడా చూసుకోలేని పరిస్థితి తలెత్తింది. ఆ తరువాత సమస్య సద్దుమణిగినా, ఆ చేదు అనుభవాలు కరుణ కుటుంబంలో ఎనలేని అగాధాన్ని మిగిల్చాయి. అందుకే గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పార్టీలో మున్ముందు సమస్యలు తలెత్తకుండా తన వారసుడెవరో ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ ఏడాది తేల్చేశారు. తన కుమారుడు ఉదయనిధికి ఉపముఖ్యమంత్రిగా పదోన్నతి కల్పించడం ద్వారా తన వారసుడిపై స్పష్టత ఇచ్చేశారు. ఈ వ్యవహారంతో పార్టీలో కొత్త జోష్ కనిపిస్తున్నా, కరుణ సమకాలీనులకు మాత్రం కాస్త కంటగింపుగా మారింది. అయితే వాటన్నింటినీ దనదైన శైలిలో తొక్కిపెట్టిన స్టాలిన్.. తన నిర్ణయానికే కట్టుబడ్డారు. అయితే స్టాలిన్‌కు సీఎం పదవి, ఆయన ఇద్దరు చెల్లెళ్లకు ఎంపీ పదవులు, కుమారుడికి డిప్యూటీ సీఎం పదవి.. ఇలా మొత్తం ఆ కుటుంబానికే ఉన్నత పదవులన్నీ లభిస్తున్నాయంటూ పార్టీలో అంతర్లీనంగా కొంత అసమ్మతికి కారణమైంది. మున్ముందు ఈ వ్యవహారం ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో కాలమే చెప్పాలి.

## ■ సెంథిల్ బాలాజీ మంత్రి పదవిపై విస్మయం!




అవినీతి కేసులో ఏడాదికి పైగా జైలు జీవితం గడిపిన డీఎంకే నేత సెంథిల్ బాలాజీకి బెయిల్ వచ్చిన మరునాడే, సెప్టెంబరు 29వ తేదీ మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించడం పట్ల సర్వత్రా విస్మయం నెలకొంది. అదే రోజు రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖ మంత్రిగా వున్న ఉదయనిధికి ఉపముఖ్యమంత్రి హోదా కట్టబెట్టడంతో పాటు, మరో ముగ్గురిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. అయితే ఈ వ్యవహారం స్టాలిన్‌కు ఈ ఏడాది రాజకీయ మచ్చగానే మిగిలిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. సెంథిల్ బాలాజీకి బెయిల్ వచ్చిన మరునాడే మంత్రిగా నియమించడం పట్ల సర్వోన్నత న్యాయస్థానం సైతం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. 'ఏదో లేకపోతే సెంథిల్ బాలాజీ వ్యవహారంలో స్టాలిన్ అంత త్వరితగతిన స్పందించాల్సిన అవసరమేంటన్న సంశయం ప్రజల్లోకి బాగా చొచ్చుకుపోయింది.

## ■ కాంగ్రెస్‌లో మారుతున్న 'మాట'


సెల్వపెరుందగై

ఇన్నాళ్లూ కామరాజర్ పాలన తెస్తామంటూ ప్రకటనలు చేసిన రాష్ట్ర కాంగ్రెస్ నేతలు.. ఈ ఏడాది కాస్త మాట మార్చారు. ఒంటరిగా పోటీ చేస్తేనే తమ బలం పెంచుకోవచ్చంటూ టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై చేసిన వ్యాఖ్యలతో ఆ పార్టీ కార్యకర్తలే ఆందోళన చెందుతున్నారు. ఒంటరిగా పోటీ చేస్తే కనీసం పది శాతం కూడా ఓట్లు సాధించుకోలేక కుదేలైన గతానుభవాలను పార్టీలోకి కొత్తగా వచ్చిన సెల్వపెరుందగై తెలుసుకున్నట్లు లేదంటూ వారు గొణుక్కుంటున్నారు. 'నేల విడిచి సాము చేస్తే' దెబ్బ తింటామని వారు వ్యాఖ్యానిస్తున్నారు. టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు, కేంద్ర మాజీమంత్రి ఈవీకేఎస్ ఇళంగోవన్ కన్నుమూయడం ఈ ఏడాది కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బ. ద్రావిడ పార్టీల నేతలతో గట్టిగా మాట్లాడి, పార్టీకి కావాల్సింది చేసి పెట్టేవాడని పేరున్న ఈవీకేఎస్ లేని లోటు రాష్ట్ర కాంగ్రెస్‌కు తీరనిది.

## ■ అన్నాడీఎంకేలో తేలని వారసత్వ స్పష్టత

దివంగత ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలితల మానసిక పుత్రిక అన్నాడీఎంకేలో ఈ ఏడాది కూడా వారసత్వంపై స్పష్టత రాలేదు. న్యాయస్థానాలు, ఎన్నికల కమిషన్ వారసుడెవరో తేల్చినా, అసమ్మతి నాయకులు మాత్రం తమదైన శైలిలో న్యాయపరమైన లొసుగుల్ని తవ్వుతూ, ఆ పార్టీని ఎలాగైనా తమ హస్తగతం చేసుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. దీంతో ఈ ఏడాది కూడా అన్నాడీఎంకేలో వారసత్వ పోరు సమసిపోలేదు. పార్టీ సర్వసభ్య సమావేశంలో జరిగిన ఎన్నిక మేరకు మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి పార్టీ ప్రధాన కార్యదర్శి అని న్యాయస్థానాలు, ఎన్నికల కమిషన్ సైతం ఇప్పటికే తేల్చేసిన విషయం తెలిసిందే. అయితే అసలు సర్వసభ్య సమావేశమే సరికాదంటూ బహిష్కృత నేతలైన మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, మాజీ ప్రధాన కార్యదర్శి వీకే శశికళ న్యాయస్థానాల తలుపు తడుతూనే వున్నారు. దీంతో ఏ క్షణంలో ఏ కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందోనని సగటు కార్యకర్త ఉత్కంఠతోనే ఈ ఏడాదంతా గడిపేశాడు. అయితే ఇవేవీ పట్టించుకోని పళనిస్వామి మాత్రం ఇటీవల తాజాగా సర్వసభ్య సమావేశంతో తన ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నించారు. తమకు కనీసం గౌరవమాత్రమైన పదవిచ్చినా చాలంటూ పన్నీర్‌సెల్వం, శశికళ చేసుకున్న వినతులను ఆయన లేశమాత్రమైనా పట్టించుకోలేదు. దీంతో ఎప్పటిలానే వారసత్వ పోరును కొనసాగించేందుకు ఆ ఇద్దరు నేతలు తమ బుర్రలకు పదును పెడుతున్నారు.

## ■ రాజకీయ తెరపైకి సినీతార

అదిగో ఇదిగో అంటూ రాజకీయాల్లోకి అడుగుపెట్టేందుకు దశాబ్దకాలంగా ప్రయత్నాలు చేసుకున్న ప్రముఖ సినీ నటుడు విజయ్.. ఎట్టకేలకు ముందుకు రావడం ఈ ఏడాది రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. ముందు అభిమాన సంఘాలను ఏర్పాటు చేసుకుని, తద్వారా సమాజ సేవ చేస్తూ..తరువాత రాజకీయాలవైపు దృష్టి సారించి, తగిన



వేదికను సిద్ధం చేసుకున్న విజయ్.. ఈ ఏడాది 'తమిళగ వెట్రి కళగం' పేరుతో పార్టీని ప్రారంభించారు. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పార్టీ ప్రారంభించిన ఆయన..ఆ తరువాతమిన్నకుండిపోయారు. కిందిస్థాయి క్యాడర్‌ను బలోపేతం చేయడం గానీ, లేదా పార్టీలో నాయకత్వ గణాన్ని పెంచడం వంటి చర్యలకు పూనుకున్నట్లుగా కనిపించడం లేదు. యువతలో విజయ్‌కు క్రేజ్ వున్నప్పటికీ, అందులో ఓటు హక్కున్నవారు తక్కువ మందే కావడం గమనార్హం. ఆయన పార్టీ మహానాడులో ప్రస్తుత రాష్ట్రంలో అధికారం చెలాయిస్తున్న డీఎంకేను, కేంద్ర అధికార పీఠంపై వున్న బీజేపీని తమ ప్రత్యర్థులుగా పేర్కొన్నారు. అయినా ఆయన వైఖరి పట్ల కొంత అస్పష్టంగా వున్న వివిధ పార్టీల నేతలు వచ్చే ఏడాదైనా స్పష్టత వస్తుందన్న ఆశతో వున్నారు.

## ■ పొత్తులు.. ఎత్తులు!



మరో ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలుండడంతో ఇప్పటి నుంచే తమతో కలిసొచ్చే వారి కోసం అన్ని పార్టీలు అన్వేషణ మొదలుపెట్టాయి. మరీ ముఖ్యంగా ఈ సారైనా అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలని గట్టిగా తలపోస్తున్న అన్నాడీఎంకే.. తమతో చేతులు కలిపే పార్టీల కోసం వేట సాగిస్తోంది. ప్రస్తుతం డీఎంకే కూటమిలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, డీపీఐ, ఎండీఎంకే వంటి ప్రధాన పార్టీలున్నాయి. వాటిల్లో కొన్నింటినైనా తమ దరి చేర్చుకుంటేనే ఓటు బ్యాంకు పెంచుకోవచ్చన్న కోణంలో అన్నాడీఎంకే అధినేత ఈపీఎస్ సన్నాహాలు మొదలుపెట్టారు. ఇందులో భాగంగా తీరప్రాంత జిల్లాల్లో మంచి పట్టున్న డీపీఐని దరి చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఆయన 'ఆఫర్‌ను డీపీఐ అధినాయకత్వం కాదనలేక, అలాగని డీఎంకే కూటమిని వీడలేక, భవిష్యత్తులో ఎదురయ్యే లాభనష్టాలను బేరీజు వేసుకుంటోంది. మరోవైపు పార్టీ ప్రారంభంలోనే డీఎంకే పట్ల తీవ్ర వ్యతిరేకత కనబరుస్తున్న తమిళగ వెట్రికళగం అధినేత విజయ్‌ని తమ చెంతకు చేర్చుకునేందుకు అన్నాడీఎంకే తీవ్ర కసరత్తు చేస్తోంది. తొలి మహానాడుకు భారీగా జనాన్ని చేర్చడంతో పాటు ఆ మహానాడుకు అన్ని విధాలా సహకరించిన అన్నాడీఎంకే.. విజయ్‌పై ఎలాంటి విమర్శలు చేయడం లేదు. అయితే 'అధికారంలో భాగస్వామ్యం' అంటూ విజయ్ చెబుతున్న మాటలు అన్నాడీఎంకేనేతల్ని కాస్త ఇరుకునబెడుతున్నాయి. అయితే మంచిమాటలతోనే ఆయన్ని మచ్చిక చేసుకుని, తమ కూటమిలో చేర్చుకుంటే ఇరువురికీ లాభదాయకమన్న కోణంలో అన్నాడీఎంకే నేతలు యోచిస్తున్నారు. అన్నీ అనుకున్నది అనుకున్నట్లు జరిగితే తమ కూటమిలో విజయ్ పార్టీ, డీఎండీకే, డీపీఐ ఉంటాయని భావిస్తున్న అన్నాడీఎంకే నేతలు.. కాంగ్రెస్, వామపక్షాలను కూడా చేర్చుకునే ఆలోచనలో ఉన్నారు. మరోవైపు తమ కూటమి నుంచి ఇతర పార్టీలు విడిపోకుండా డీఎంకే అధినేత స్టాలిన్ చర్యలు చేపడుతున్నారు. కాస్త అసంతృప్తిగా వున్న డీపీఐ, ఎండీఎంకే, కాంగ్రెస్‌లను ఆయన బుజ్జగిస్తున్నారు. వామపక్షాలు మాత్రం బీజేపీ వ్యతిరేకతే ప్రధాన అజెండాగా డీఎంకే కూటమిలో ఉండేందుకే నిశ్చయించుకున్నాయి. కాగా


తిరుమావళవన్

ప్రస్తుతం కేంద్ర మాజీ మంత్రి జీకే వాసన్ నేతృత్వంలోని టీఎంసీ, వన్నియార్ల పార్టీగా పేరున్న పీఎంకే మినహా మరే బలోపేతమైన పార్టీ అండ లేని బీజేపీ.. మున్ముందు తమ కూటమిని బలోపేతం చేసుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. విజయ్ పార్టీ, డీఎండీకేతో పాటు అన్నాడీఎంకేని కూడా తమ కూటమిలో చేర్చుకునేందుకు బీజేపీ సామదానభేద దండోపాయాలను ప్రదర్శిస్తుండడం కొసమెరుపు.

## ■ గవర్నర్ వైఖరి కోసం కొత్త ఏడాది ఎదురు చూపులు

నాలుగేళ్ల క్రితం గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టింది మొదలు డీఎంకే ప్రభుత్వాన్ని ఇరుకునబెట్టడమే లక్ష్యంగా వ్యవహరించిన గవర్నర్ ఆర్ఎన్ రవి ఈ ఏడాది కూడా తన పంథానే కొనసాగించారు. ద్రావిడానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తూ పలుమార్లు వివాదానికి కేంద్ర బిందువుగా మారారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలో ప్రభుత్వం ఆమోదించిన ప్రసంగ పాఠానికి భిన్నంగా మాట్లాడి న్యాయ, రాజ్యాంగ నిపుణులనే డైలమాలో పడేశారు. దాంతో ప్రభుత్వం గవర్నర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం తీర్మానం చేయగా, ఆయన జాతీయగీతాలాపనకు ముందే అసెంబ్లీ నుంచి వెళ్లడం మరో వివాదానికి కారణమైంది. ఇప్పుడు మళ్లీ కొత్త సంవత్సర అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ సారి ఆయన వైఖరి ఎలా వుంటుందో? ప్రభుత్వం ఎలా స్పందిస్తుందోనన్న ఉత్కంఠతోనే రాష్ట్ర రాజకీయాలు కొత్తవత్సరంలోకి అడుగుపెడుతున్నాయి.


అసెంబ్లీ నుంచి వెళ్లిపోతున్న గవర్నర్

## ■ అన్నామలై వినూత్న శపథం

రాష్ట్రంలో వేళ్లూనుకునేందుకు గట్టి కృషి చేస్తున్న బీజేపీ.. ఆ మేరకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కొన్నాళ్లపాటు అంతర్జాతీయ రాజకీయాలపై లండన్‌లో అధ్యయనం చేసివచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు.. పార్టీ బలోపేతానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన తీసుకున్న రెండు నిర్ణయాలు దేశవ్యాప్త చర్చకు దారి తీశాయి. రాష్ట్రంలో డీఎంకే పాలన అంతరించేంత వరకు తాను చెప్పులు వేసుకోనని ప్రకటించి సొంతపార్టీ నాయకుల్ని సైతం ఆలోచనలో పడేశారు. డీఎంకే పాలన అంతమే తన లక్ష్యమని చెప్పిన ఆయన.. అది సాధించేవరకూ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోనని కూడా ప్రకటించారు. అంతేగాక విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనను ఖండిస్తూ శుక్రవారం కొరడాతో కొట్టుకున్న అన్నామలై.. 48 రోజుల పాటు దీక్ష చేసి, మురుగన్‌కు రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాల గురించి నివేదిస్తానని ప్రకటించడం విశేషం.


ఇక చెప్పులు వేసుకోనంటూ తన బూట్లను తొలగిస్తున్న అన్నామలై

# దేవాదాయశాఖ విద్యాలయాల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం

● మంత్రి శేఖర్‌బాబు

చెన్నై, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నడుపుతున్న పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన పథకాలను అమలు చేయనున్నట్లు ఆ శాఖా మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. తిరుచ్చి సమయపురం మారియమ్మన్ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో మారియమ్మన్ ఆలయం, నామక్కల్ నరసింహస్వామి ఆలయం, సేలం కోట్టై మారియమ్మన్ ఆలయం, కోట్టై అళగిరి నాధస్వామి ఆలయం, కారువళ్లి ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో భక్తులు కానుకల రూపేణా చెల్లించిన 541 కేజీల బంగారు నగలను ముంబయిలోని టంకశాలలో కరిగించి స్టేట్‌బ్యాంక్‌లో డిపాజిట్ చేసేనిమ్మిం ఆ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అతుల్ ప్రియదర్శినికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ కూడా పాల్గొన్నారు. ఆ తర్వాత సమయపురం మారియమ్మన్ ఆలయంలో భక్తులకు అమలు చేస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని మంత్రులిరువురూ పరిశీలించారు. ఆ సందర్భంగా ఇరువురూ కలిసి భక్తులకు భోజనం వడ్డించారు.


మారియమ్మన్ ఆలయంలో భక్తులకు అన్నం వడ్డిస్తున్న మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు

# బియ్యపు గింజలతో తిరువళ్లువర్ విగ్రహం

చెన్నై, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి వద్దనున్న 133 అడుగుల తిరువళ్లువర్ విగ్రహం రజతోత్సవాలను పురస్కరించుకుని ఓ డ్రాయింగ్ మాస్టర్ బియ్యపు గింజలతో తిరువళ్లువర్ విగ్రహాన్ని రూపొందించి పలువురి ప్రశంసలందుకుంటున్నారు. తిరునల్వేలి జిల్లా కల్లిడకురిచ్చి ప్రాంతంలో ప్రైవేటు పాఠశాలలో శరవణన్ అనే డ్రాయింగ్ మాస్టర్ పనిచేస్తున్నారు. ఈ నెలాఖరున కన్నియాకుమారిలో తిరువళ్లువర్ విగ్రహం ప్రతిష్ఠించి 25యేళ్లు పూర్తయిన సందర్భంగా శరవణన్ తన చిత్రకళా ప్రతిభను ఉపయోగించి బియ్యపు గింజలతో 3 అంగుళాల ఎత్తుతో తిరువళ్లువర్ విగ్రహాన్ని తయారు చేశారు.


బియ్యపు గింజలతో తయారైన తిరువళ్లువర్ విగ్రమం

# 'స్వర్గ వాసల్' చిత్రంపై స్టే విధించలేం: హైకోర్టు

ప్యారీస్, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): నటుడు ఆర్జే బాలాజీ నటించి శుక్రవారం దేశ వ్యాప్తంగా విడుదలైన స్వర్గ వాసల్ చిత్రానికి స్టే విధించేందుకు హైకోర్టు మదురై బెంచ్ నిరాకరించింది. స్వాతంత్ర్య సమరయోధులు వీరపాండ్య కట్టబ్రహ్మన్న పరువు ప్రతిష్ఠలను దెబ్బతీసే విధంగా కొన్ని దృశ్యాలున్నాయని స్వర్గవాసల్ చిత్రానికి స్టే విధించాలని కోరుతూ మదురైకి చెందిన న్యాయవాది హైకోర్టు మదురై బెంచ్ న్యాయమూర్తులు వేలు మురుగన్, జ్యోతి రామన్‌లతో కూడిన ధర్మాసనం ముందు శుక్రవారం ఓ వినతి పత్రం సమర్పించారు. అందులో వీరపాండ్య కట్టబ్రహ్మన్న చరిత్రను వక్రీకరించే లా తెరకెక్కించిన స్వర్గ వాసల్ సినిమాకు స్టే విధించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం ఓటీటీలో విడుదలైన స్వర్గవాసల్ సినిమాకు స్టే విధించడం ఎలా సాధ్యమౌతుందని పిటీషనర్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతం సినిమాలకు సంబంధించి కేసు దాఖలు చేయడం ఫ్యాషన్‌గా మారిందని న్యాయమూర్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో నిర్మించిన ఒక చిత్రానికి స్టే విధించమని కోరడం ఆమోదయోగ్యం కాదని, తమకు ఆ అధికారం కూడా లేదని న్యాయమూర్తులు తేల్చిచెప్పారు. అవసరమైతే మద్రాసు హైకోర్టును గానీ, సుప్రీమ్ కోర్టును గానీ ఆశ్రయించాలని పిటీషనర్‌కు సూచించారు.

# నందనంలో 'పుస్తక ప్రదర్శన' ప్రారంభం


పుస్తక ప్రదర్శన ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

పెరంబూర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందనం వైఎంసీఏ మైదానంలో ఏర్పాటుచేసిన 49వ 'చెన్నై పుస్తక ప్రదర్శన'ను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ శుక్రవారం ప్రారంభించారు. దక్షిణ భారత పుస్తక విక్రయదారులు, ముద్రణా సంస్థల సంఘం (బపాసి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన జనవరి 12వ తేది వరకు జరుగనుంది. ఈ ప్రదర్శనలో మొత్తం 900 స్టాల్స్ ఏర్పాటుచేశారు. సాధారణ రోజుల్లో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8.30 గంటలు, సెలవు రోజుల్లో ఉదయం 11 నుంచి రాత్రి 8.30 గంటలకు ప్రదర్శన జరుగనుంది. అన్ని పుస్తకాలపై 10 శాతం రాయితీ ప్రకటించారు. దేవాదాయ శాఖ వెలువరించిన పుస్తకాలతో ప్రత్యేక స్టాల్ ఏర్పాటైంది. ప్రదర్శనలో భాగంగా కొత్త పుస్తకాల ఆవిష్కరణ, సదస్సులు, విద్యార్థులకు వ్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, నగర మేయర్ ప్రియ, ఎమ్మెల్యేలు ఈ.పరంధామన్, సీవీఎంపీ ఎళిలరసన్, ఎం.మహేష్‌కుమార్, రాష్ట్ర మహిళల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దివ్యదర్శిని తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శనలో ఏర్పాటైన స్టాల్స్

# సంగీతానికి నిలయం... చెన్నై మహానగరం

● సితార విద్వాంసుడు పండిట్ జనార్ధన్ మిట్టా ● విశ్వకళా సంగమ సంగీతోత్సవాలు ప్రారంభం ● వీనుల విందుగా జుగల్బందీ

ప్యారీస్, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహా నగరం సంగీతానికి నిలయమని ప్రముఖ సితార విద్వాంసులు పండిట్ జనార్ధన్ మిట్టా అన్నారు. విశ్వకళా సంగమ ఆధ్వర్యంలో 25వ స్వామి హరిదాస్ సంగీత సమారో వార్షిక సంగీతోత్సవాలు శుక్రవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. ఆళ్వార్‌పేటలోని ట్యాగ్ సెంటర్ వేదికగా సాయంత్రం 6.15 గంటలకు అపరాజిత ప్రార్థనా గీతంతో ప్రారంభం కాగా, భారతరత్న పండిట్ రవిశంకర్ శిష్యులు పండిట్ జనార్ధన్ మిట్టా సంగీతోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో సంగీతానికి చెన్నై నిలయంగా యునెస్కో ప్రకటించిందన్నారు. మార్గశిర మాసంలో సంగీత కచ్చేరీతో చెన్నై నగరం సంగీత ధ్వనులతో పులకించి పోతోందన్నారు. గడిచిన 25 సంవత్సరాలుగా హిందుస్థానీ సంగీతానికి విశ్వకళా సంగమం చేస్తున్న కృషికి ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఊరా లక్ష్మీనరసింహారావును ప్రశంసించారు. జనార్ధన్ మిట్టా కుమార్తె పల్లవి స్వాగతోపన్యాసం చేయగా, విశ్వకళా సంగమ వ్యవస్థాపకులు ఊరా లక్ష్మీనరసింహారావు, హేమలత దంపతులు కళాకారులను ఘనంగా సత్కరించారు. ఈ నెల 29వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో పద్మశ్రీ చిత్రా విశ్వేశ్వరన్, పద్మశ్రీ తోట తరుణి, పండిట్ తేజేంద్ర ముజుందర్, విద్వాన్ శశాంత్ సుబ్రహ్మణ్యంలకు విశ్వకళా పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. తొలిరోజు కార్యక్రమంగా జుగల్ బందీ సంగీత విభావరి వీనులవిందుగా సాగింది. పండిట్ సుబేంద్రరావు(సితార), విదూషి సస్కియారావు(సెల్లో), పండిట్ రవీంద్ర యావగల్(తబలా)తో సంగీత విభావరిని రక్తికట్టించారు. జుగల్బందీ కార్యక్రమాన్ని డాక్టర్ ప్రభ ఆత్రేజీకి అంకితమిస్తున్నట్లు సభలో ప్రకటించారు.



సంగీత విద్వాంసులను సత్కరిస్తున్న ఊరా లక్ష్మీ నరసింహారావు, హేమలత దంపతులు

# ఆ వీఆర్వో మా కొద్దు!

**తహసీల్దార్ కార్యాలయం వద్ద మత్తేరిమిట్టవాసుల ధర్నా**



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దళిత రైతులు

వరదయ్యపాళెం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రికార్డులు తారుమారు చేస్తున్న వీఆర్వో తమకు వద్దంటూ మత్తేరిమిట్ట దళిత రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండలంలోని చిలమత్తూరు పంచాయతీ మత్తేరిమిట్టలోని సర్వే నెం.35లో సుమారు 60ఎకరాల భూమిని 1960 నుంచి తాము సాగు చేసుకుంటున్నామని చెప్పారు. రైతు శ్రీనివాసమూర్తి ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొంత భూమిని విక్రయించారన్నారు. ఈక్రమంలో శ్రీనివాసమూర్తి కుటుంబీకుల్లో ఒకరైన ప్రియ చిలమత్తూరు పంచాయతీ సమీపంలో పరిశ్రమలు నెలకొల్పిందన్నారు. ఆమెకు ఎవరో ఆశ చూపి దళిత నిరుపేదలైన తమ పేరుపై ఉన్న భూములను వీఆర్వో రమణయ్య తారుమారు చేశాడని ఆరోపించారు. 2020-24 మధ్య ఇక్కడ పనిచేశారని, సాధారణ బదిలీల్లో వేరే పంచాయతీకి మార్చారన్నారు. కానీ మళ్లీ ఇదే మండలానికి బదిలీ చేయించుకున్నాడన్నారు. అనంతరం తమ సమస్యను పరిష్కరించాలంటూ తహసీల్దారు రాజశేఖర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా తహసీల్దారు రాజశేఖర్ మాట్లాడుతూ... భూముల పత్రాలను అందిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మస్తాన్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి, చంద్రారెడ్డి, సుబ్బరాయుడునాయుడు, మహేంద్ర, నందకిషోర్, ప్రభాకర్, మనోహర, శేఖర్‌నాయుడు, రామకృష్ణ, స్వామిదాస్, వెంకటేష్, రాజగోపాల్‌నాయుడు, విశ్వనాథ్‌నాయుడు, సురేష్ తదితరులు పాల్గొనారు.

## దర్శనానికి 18 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని 31 కంపార్టుమెంట్లలోనారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

**బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.4.18 కోట్లు**

**గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 59,564**

**తలనీలాలు సమర్పించినవారు: 24,905**





# కళతప్పిన నాదనీరాజనం

తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీనివాసుడు నాదప్రియుడు. ఆలయం ముందు నాట్య, గానాలతో కళాకారులు తిరుమలేశుని నివేదించుకునే అరుదైన కార్యక్రమానికి టీటీడీ శ్రీకారం చుట్టింది. దానికి 'నాదనీరాజనం' అనే పేరు పెట్టారు. భారతరత్నలు, పద్మభూషణులు, పద్మశ్రీలు ఎందరో ఈ వేదికమీద నుంచి కళార్చన చేశారు. టీటీడీ కూడా ఈ కళాకారులను సముచితంగా సత్కరించి స్వామి దర్శనం చేయించి గౌరవించుకునేది. జగన్ జమానాలో కళపై కత్తికట్టారు. 'నాదనీరాజనం' కార్యాక్రమాన్ని భ్రష్టుపట్టించారు. కళాకారులకు కనీసం దర్శనాలు కూడా లేకుండా చేశారు. ఈ కార్యక్రమానికి ప్రాధాన్యం లేకుండా చేసేశారు. కూటమి ప్రభుత్వం అయినా 'నాదనీరాజనం' లోపాలను సరిదిద్ది పూర్వ వైభవం తీసుకురావాలని కళాభిమానులు కోరుకుంటున్నారు.







- జగన్ జమానాలో నీరుగార్చేశారు
- కళాకారులకు కరువైన గౌరవం
- ముఖం చాటేస్తున్న ప్రసిద్ధులు
- కళాకారుల ఎంపిక తీరుపై ఆరోపణలు
- పూర్వ వైభవాన్ని పునరుద్ధరించాలని కొత్త పాలకమండలికి కళాభిమానుల వేడుకోలు

### గతమెంతో ఘనం

2009 ఆగష్టు 15న తిరుమల ఆలయం ఎదురుగా ఉండే వేదికపై 'నాదనీరాజనం' ప్రదర్శనలు మొదలయ్యాయి. ఈ వేదికను ఒక దాత నిర్మించారు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే కార్యక్రమాలు 'నాదనీరాజనం'లో జరిగేవి. శాస్త్రీయ నృత్య, సంగీతాలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. భారతరత్న లత మంగేష్కర్ (గాత్రం), పద్మవిభూషణ్ లు హరిప్రసాద్ చౌరస్యా (వేణువు), పండిట్ శివకుమార్ (సితార్), మంగళంపల్లి బాలమురళీకృష్ణ (గాత్రం), శివరామన్ (మదంగం), పద్మశ్రీలు రంజన గోహార్ (ఒడిస్సీ), శోభానాయుడు (భరతనాట్యం), మీనాక్షి (కూచిపూడి), విఠల్‌దాస్ (నామసంకీర్తనం), కుమారి కన్యకుమారి (వయోలిన్), ఎల్లా వెంకటేశ్వర్లు (మృదంగం) వంటి ఎందరో ప్రసిద్ధులు ఈ వేదికపై ప్రదర్శనలు ఇచ్చారు. నిజానికి 'నాదనీరాజనం' వేదికపై ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు దేశ,విదేశాల్లో ఉన్న డిమాండు సామాన్యమైనది కాదు. లక్షలకు లక్షలు చెల్లించినా కార్యక్రమానికి వారు అంగీకరించడం అంత సులువు కాదు. సాక్షాత్తూ తిరుమల స్వామి సమక్షంలో తాము పాడుతున్నామనీ, నృత్యం చేస్తున్నామనే భావనే వీరిని తిరుమలకు రప్పించేది.

### ఇలా ఉండేది..

సుదూర ప్రాంతాల నుంచి ప్రదర్శన ఇచ్చేందుకు తిరుమలకు వచ్చే కళాకారులకు గతంలో ప్రత్యేక గౌరవాన్ని ఇచ్చేవారు. ఏ టాప్‌కు రూ.35 వేలు, ఏ గ్రేడ్‌కు రూ.30 వేలు, నత్యంకు రూ.60 వేలు, నామసంకీర్తనంకు రూ.20 వేలు అందజేసేవారు. అలాగే కళాకారులందరికీ ఉచిత రవాణా, బస కల్పించేవారు. ప్రత్యేక దర్శనం ఉండేది. ప్రదర్శన అనంతరం వేదిక మీదే వీరిని సత్కరించి లడ్డూ ప్రసాదాలు అందజేసేవారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమాలకు ఈవో, జేఈవోలు సైతం హాజరయ్యేవారు. కళాకారులు కూడా ఎంతో సంతృప్తి చెందేవారు.

### ఇలా దిగజారింది..

జగన్ జమానాలో కళాప్రదర్శనలకు విలువ లేకుండా పోయింది. కళాకారులను గౌరవించడం తగ్గిపోయింది. టీటీడీకి ఆర్థికభారం అంటూ అన్నీ రద్దు చేసేశారు. 'నాదనీరాజనం'లో ప్రదర్శన ఇవ్వాలనుకున్నవారు సొంత ఖర్చుతోనే తిరుమలకు రావాలని ఆదేశించారు. కళాకారులకు ఉచిత వసతి లేదన్నారు. చివరికి స్వామి దర్శనాలు కూడా కుదరదని చెప్పేశారు. కార్యక్రమం సమయాన్ని కూడా మధ్యాహ్నం 3.10 నుంచి 4.30 గంటలకు మార్చారు. 2020 నుంచి ఏడాది పాటు ఈ విధానం కొనసాగింది. దీంతో చాలా మంది ప్రముఖ కళాకారులు రావడానికి ఇష్టపడలేదు. ఒకప్పుడు కర్ణాటక, హిందుస్థానీ సంగీత కచేరీలకూ, నామసంకీర్తనం కళాకారులకూ వేదిక అయిన 'నాదనీరాజనం' ఇప్పుడు వెలవెల పోతోంది. కూచిపూడి, భరతనాట్యం, కథక్, కథాకళి, ఆంధ్రనాట్యం, మోహినియాట్టం, మణిపురి, ఒడిస్సి శాస్త్రీయ నత్యాలను ఈ వేదిక మీద నుంచి వీక్షించిన ప్రేక్షకులకు ఇప్పుడు నిరాశే మిగులుతోంది. వయోలిన్, మృదంగం, ఘటం, డోలు, వేణువు, కంజీర, మోర్సింగ్, నాదస్వరం, వీణ, శాస్సోఫోన్, తవిల్, సితార్, సరోద్ వంటి వాయిద్య విన్యాసాలను తన్మయులై వీక్షించిన వారు.. ప్రస్తుత ప్రదర్శనల తీరు చూసి పెదవి విరుస్తున్నారు.

### కళావిలువలకు తిలోదకాలు

'నాదనీరాజనం' ప్రదర్శనలకు గతంలో ఒక ఎంపిక కమిటీ ఉండేది. టీటీడీ మాజీ ఈవో పీవీఆర్కే ప్రసాద్ నేతృత్వంలో.. కుమారి కన్యాకుమారి, శోభారాజ్, మల్లాది సూరిబాబు, గంగాదేవి, నేదునూరి కృష్ణమూర్తి వంటి దాదాపు 35 మంది సంగీత ప్రముఖులు ఈ కమిటీలో ఉండేవారు. వీరు కళాప్రదర్శనలు ఎంపిక చేసి ఏ రోజున ప్రదర్శన ఇవ్వాలో నిర్ణయించేవారు. 2017లో పీవీఆర్కే ప్రసాద్ మరణం తర్వాత నిపుణుల కమిటీ లేకుండా పోయింది. అయితే 2022 ఫిబ్రవరిలో సంగీత కళాశాల, వేదిక్ యూనివర్సిటీ, ఎస్వీబీసీ అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. కళాకారుల ఎంపిక తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. గ్రేడ్‌తో నిమిత్తం లేకుండా ఇష్టానుసారం కళాప్రదర్శనలకు అనుమతులు ఇచ్చేశారు. కళాకారుల పట్ల టీటీడీ తీరుపై అసంతృప్తి చెందిన ప్రసిద్ధులైన కళాకారులు 'నాదనీరాజనం'పై ఆసక్తి చూపలేదు. దీంతో కళాకారులకు పారితోషకాన్ని రద్దు చేసి, ప్రదర్శన ఇచ్చిన కళాకారులకు మాత్రమే దర్శనం, వసతిని కల్పించారు. ఉచితంగా ప్రదర్శనలిచ్చేందుకు ఔత్సాహికులైన కళాకారులు దరఖాస్తు చేసుకోవచ్చునంటూ అప్పట్లో హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రకటనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### చైర్మన్‌గారూ పట్టించుకోండి

శ్రీకృష్ణదేవరాయలు వంటి కళాపోషకులకు ఆరాధ్య దైవం అయిన తిరుమల శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో గత కొన్నేళ్లుగా జరుగుతున్న కళారహిత చర్యలను సరిదిద్దాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన కళాభిమానులు డా. టి.శ్రీనివాసరావు, డా. కె.జగ్గారావు టీటీడీ చైర్మన్ బీఆర్. నాయుడును అభ్యర్థిస్తూ ఒక లేఖ రాశారు. ఒకప్పటి పారితోషకాల విధానాన్నీ, గౌరవాలను తిరిగి ప్రవేశపెట్టి నాదనీరాజనంకు పూర్వపు వైభవాన్ని పునరుద్ధరించాలని కోరారు.

**క్రైం కార్నర్**

## విద్యార్థిని పట్ల అసభ్యకర ప్రవర్తన

- ఎస్వీ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ అరెస్ట్



ఉమా మహేష్

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాలలో విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలో ప్రొఫెసర్ ఉమామహేష్ శుక్రవారం అరెస్టయ్యారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. వ్యవసాయ కళాశాలలో క్రాప్ ఫిజియోలజీ విభాగంలో ఉమామహేష్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. రాయలసీమ జిల్లాలకు చెందిన ఓ విద్యార్థిని ఫీజులు సక్రమంగా చెల్లించి తరగతులకు హాజరవుతున్నారు. ఈ క్రమంలో ఆమె ఒక్కరే క్లాస్‌కు రావడంతో నవంబరు నెలలో పాఠం చెబుతూ.. ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బయటకు చెప్పేందుకు మధనపడిన ఆమె.. చివరకు ఇప్పుడు తన తల్లిదండ్రులకు చెప్పారు. వారు శుక్రవారం తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందును కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ప్రొఫెసర్‌ను అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు.

## మహిళ వద్ద రూ.2.80 లక్షల అపహరణ



బాధితురాలు పల్లెమ్మ

నాయుడుపేట టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులో నగలు తాకట్టు పెట్టి తీసుకెళ్తున్న రూ.2.80 లక్షలు అపహరణకు గురైన ఘటన నాయుడుపేట పట్టణంలో చోటుచేసుకుంది. బాధితురాలి కథనం మేరకు వివరాలు... మండలంలోని గొట్టిప్రోలు గ్రామంలో నివాసం ఉంటున్న పల్లెమ్మ వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తోంది. వ్యవసాయ పనులకు డబ్బులు అవసరం కావడంతో శుక్రవారం బ్యాంకుకు వెళ్లి నగలు తాకట్టుపెటి రూ.2.83 లక్షలు తీసుకుంది. ఇందులో రూ.3వేలు ఖర్చుల కోసం పర్సులో పెట్టుకుంది. మిగతా నగదును కర్రల సంచిలో భద్రపరుచుకుని బ్యాంక్ నుంచి బయలుదేరింది. బజారులో కిరాణా దుకాణం వద్ద ఆగి వస్తువులను కొనుగోలు చేసే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు రూ.2.80 లక్షలు అపహరించారు. కొంతసేపటి తరువాత సంచిలో నగదు లేకపోవడాన్ని గుర్తించి లబోదిబోమంటూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది.

# వైసీపీ నేత బుల్లెట్ జయశ్యామ్ అరెస్టు

- చీటింగ్ కేసులో 14రోజులు రిమాండ్

శ్రీకాళహస్తి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు బుల్లెట్ జయశ్యామ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చీటింగ్ కేసులో ఆయనకు 14రోజుల రిమాండ్ విధించారు. శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని రాజీవ్‌నగర్ వద్ద కొందరు వైసీపీ నాయకులు పిచ్చాటూరు రహదారికి ఆనుకుని ఉన్న పనస కాలువ భూమిని గత ప్రభుత్వ హయాంలో కబ్జా చేశారు. ఆ స్థలాలను వాటాలుగా వేసుకుని అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఈ క్రమంలో బుల్లెట్ జయశ్యామ్ తొట్టంబేడు మండలం శివనాథపురం రెవెన్యూ పరిధిలోని పనసకాల్వ భూమిని ఆక్రమించినట్లు బాహాటంగా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ యేడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పనసకాలువ భూమిలో అక్రమంగా నిర్మించిన 105 కట్టడాలను అధికారులు కూల్చివేశారు. ఇందులో కేవీబీపురం మండలం రాజులకండ్రిగకు చెందిన కేశవులు అనే వ్యక్తి బుల్లెట్ జయశ్యామ్‌కు రూ.6లక్షలు నగదు చెల్లించి స్థలం కొనుగోలు చేశాడు. ఆరు నెలల క్రితం అది కాలువ భూమిగా తేలడంతో అధికారులు అక్కడ కట్టడాలను కూల్చివేశారు. దాంతో బాధితుడు కేశవులు తన నగదు రూ.6లక్షలు తిరిగి ఇవ్వాలని జయశ్యామ్‌పై ఒత్తిడి చేశాడు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం బాధితుడు కేశవులు తనకు కాలువ స్థలాన్ని అమ్మి బుల్లెట్ జయశ్యామ్ అనే వ్యక్తి మోసానికి పాల్పడ్డాడని గట్టిగా నిలదీస్తే రూ.లక్ష నగదు ఇచ్చాడని... ఆ తరువాత నెలలు గడుస్తున్నా మిగతా నగదుపై సమాధానం చెప్పడం లేదని తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై చీటింగ్‌కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఈ కేసులో తొట్టంబేడు పోలీసులు బుల్లెట్ జయశ్యామ్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అనంతరం కోర్టుకు హాజరుపరచడంతో 14రోజుల రిమాండ్ విధించారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బుల్లెట్ జయశ్యామ్ తీరుపై పెద్దఎత్తున అభియోగాలు వ్యక్తమయ్యాయి. అలాగే ఆయన బహిరంగంగా దౌర్జన్యాలకు పాల్పడటం దుమారం రేపింది. రెండేళ్ల క్రితం పట్టణ నడిబొడ్డున ఎన్టీఆర్ కూడలిలో పాలసరఫరా సంఘం ఎన్నికల నామినేషన్ రోజున టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు కారుపై కాసిరాళ్లతో దాడి చేసి విధ్వంసానికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా ప్రజలందరూ చూస్తుండగానే చలపతినాయుడును కారు నుంచి బయటకులాగి విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఇక పాలకమండలి సభ్యుడుగా ముక్కంటి ఆలయంలో పలువురు అధికారులపై బూతులతో రెచ్చిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి.

# మినీ ట్రక్కును ఢీకొన్న లారీ

- ఒకరి మృతి, ఎనిమిది మందికి గాయాలు
- గొర్రెల సంతకు వెళుతుండగా ప్రమాదం
- క్షతగాత్రులందరూ రైల్వేకోడూరువాసులే

గూడూరు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గొర్రెల సంతకు వెళ్తున్న మినీ ట్రక్కును లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన గూడూరు మండలం చెన్నూరు సమీపంలో శుక్రవారం వేకువజామున 3గంటలకు జరిగింది. గూడూరు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు... అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరువాసులు చిల్లకూరు మండలం ముత్యాలపాడు సమీపంలోని గొర్రెల సంతకు మినీట్రక్కులో శుక్రవారం రాత్రి బయలుదేరారు.వేకువజామున 3గంటల సమయంలో గూడూరు మండలం చెన్నూరు సమీపంలో గూడూరు వైపు నుంచి తిప్పవరప్పాడు వైపు వెళుతున్న లారీ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మినీట్రక్కును ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రక్కులో ప్రయాణిస్తున్న అన్నమయ్య జిల్లా పిట్లావారిపల్లెకు చెందిన సోమయ్య(45) మృతిచెందాడు. నాగవరం గ్రామానికి చెందిన మణి, సుబ్రహ్మణ్యం, ఓబులపల్లెకు చెందిన చిన్నవెంకటయ్య, పాతబజారుకు చెందిన రమణయ్య, తిన్నిశెట్టిపల్లెకు చెందిన పెంచలయ్య, చిన్నరాసపల్లెకు చెందిన ఈశ్వరయ్య, పైనపల్లి గ్రామానికి చెందిన భాస్కర్, రైల్వే కోడూరుకు చెందిన సూర్యప్రకాష్ తీవ్రంగా గాయపడ్డారు. సోమయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులకు ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యంకోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు. లారీ వేగంగా ఢీకొనడంతో మినీట్రక్కు ముందుభాగం నుజ్జునుజ్జయింది. కొంతమంది క్షతగాత్రులు వాహనంలో ఇరుక్కుపోవడంతో పోలీసులు క్రేన్ సాయంతో గాయపడిన వారిని వెలుపలికి తీశారు.



మృతి చెందిన సోమయ్య - దెబ్బతిన్న మినీట్రక్కు

# ఐదుగురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- 80 గ్రాముల బంగారం, కారు స్వాధీనం

సత్యవేడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఐదుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను సత్యవేడు పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ రామస్వామి తెలిపిన వివరాల మేరకు... శుక్రవారం ఉదయం స్థానిక పాలశీతలీకరణ కేంద్రం సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించామన్నారు. ఊత్తుకోట నుంచి వస్తున్న కారు పోలీసులను చూసి దారి మళ్లించేందుకు ప్రయత్నిస్తుండగా అప్రమత్తమై కారును చుట్టుముట్టామన్నారు. కారులో ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసకున్నామన్నారు. అనంతరం కారును తనిఖీ చేయగా 80 గ్రాముల బంగారం ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిని విచారించగా మండలంతో పాటు తమిళనాడులోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతన్నట్లు తేలిందన్నారు. ఈ ముఠా సత్యవేడు మండలం శిరుణంబూదూరులో ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేదీ రాత్రి ఓ ఇంటి తలుపులు ధ్వంసం చేసి బీరువాలో ఉన్న 40 గ్రాముల బంగారు చోరీ చేసిందన్నారు. అదే విధంగా దాసుకుప్పంలో ఈ ఏడాది మార్చి 20వ తేదీ మధ్యాహ్నం ఓ ఇంట్లో 40 గ్రాముల బంగారం చోరీ చేసినట్లు విచారణలో అంగీకరించారని తెలిపారు. అదే విధంగా తమిళనాడు రాష్ట్రం ఈరోడ్, రాణిపేట జిల్లాల్లో కూడా ఇటీవల తాజాగా చోరీలకు పాల్పడి కారుతో పాటు బంగారు నగలను అపహరించినట్లు తేలిందన్నారు. పట్టుబడ్డ వారిలో తమిళనాడు రాష్ట్రం విల్లుపురం జిల్లా సావుకుప్పానికి చెందిన వి.కన్నదాసన్(28), తిరువణ్ణామలై జిల్లా వెంగిక్కల్‌కు చెందిన జీ.శ్రీరామ్ అలియాస్ బిల్లు (19), రంజిత్‌కుమార్ (19), కాంచీపురం జిల్లా మధురమంగళానికి చెందిన డి.రవి(27), విల్లుపురం జిల్లా సెంజివట్టానికి చెందిన బాలుడు ఉన్నారు. వీరు తమిళనాడులో వివిధ కేసుల్లో జైలుశిక్ష అనుభవించి ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చినట్లు తెలిసింది.



అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్‌ను చూపుతున్న పోలీసులు



మత్స్యకార నాయకులతో సమావేశమైన ఎఫ్‌డీవో మహిజ

## బకాయిలు చెల్లిస్తేనే పక్షుల పండుగకు పడవలిస్తాం

- ఎఫ్‌డీవోకు తేల్చి చెప్పిన మత్స్యకార నాయకులు -

తడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 2019 పక్షుల పండుగ సమయంలో ఏర్పాటు చేసిన పడవలకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లిస్తేనే వచ్చేనెల జరిగే ఫ్లెమింగో ఫెస్టివల్‌కు పడవలను సమకూర్చుతామని మత్స్యకార నాయకులు ఎఫ్‌డీవో మహిజకు తేల్చిచెప్పారు. శుక్రవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో మత్స్యకార నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. వచ్చే నెలలో ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా భీములవారిపాళెం పడవల రేవులో పడవ షికారు ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకోసం పడవలను సమరూర్చాలని కోరారు. మత్స్యకార నాయకులు స్పందిస్తూ ఆరేళ్లుగా తమ బకాయిల కోసం అధికారుల చుట్టూ తిరిగామని, 2020లో ధర్నా చేస్తే పోలీసులు తమపై కేసులు పెట్టి వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 పక్షుల పండుగ బకాయిలు చెల్లిస్తేనే పడవలు ఇస్తామని తేల్చిచెప్పారు. ఒక రోజుకు ఒక్కొక్క పడవకు రూ.7వేల అద్దె, పడవ నడిపే ముగ్గురు వ్యక్తులకు కూలి, భోజనాల కోసం రూ.3000 చొప్పున మొత్తం రోజుకు రూ.10వేలు అవుతుందని చెప్పారు. పాత బకాయిలు చెల్లించడంతో పాటు వచ్చే నెలలో పండుగకు అడ్వాన్స్‌గా కొంత చెల్లించాలని స్పష్టం చేశారు. సమావేశంలో మత్స్యకార నాయకులు బొమ్మన పళణి, మనోహర్, సుధాకర్, ప్రకాష్, ఏకాంబరం, జయపాల్, వాసు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## ఐదుచోట్ల పక్షుల పండుగ

- ఏర్పాట్లను పరిశీలించిన డీఆర్‌డీఏ పీడీ

సూళ్లూరుపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో వచ్చే నెల 17నుంచి 19 వరకు మూడు రోజుల పాటు ఐదుచోట్ల పక్షుల పండుగ నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులతో కమిటీలను కూడా నియమించారు. ఆయా కమిటీల ఆధ్వర్యంలో సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానం, అట్టకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రం, నేలపట్టు, బీవీపాలెం, శ్రీసిటీలో పక్షుల పండుగ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు పక్షుల పండుగ జరిగే జూనియర్ కళాశాల మైదానం, అట్టకానితిప్పలో ఉన్న పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. పక్షుల పండుగకు వచ్చే సందర్శలకు అవసరమైన వసతులు, ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో గూడూరు డీఎల్‌డీవో వాణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్, ఏఈ భవాని, ఏపీఎం ప్రసన్న కుమారి, ఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అట్టకానితిప్పలో ఏర్పాట్ల గురించి తెలుసుకొంటున్న డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, డీఎల్‌డీవో వాణి తదితరులు

